


# భారత్ ప్రతినిధి

తెలుగు దిన పత్రిక








సంపుటి: 3 సంచిక: 272 పేజీలు: 8 సంపాదకులు: రోళ్ళ రఘునాథ్ రెడ్డి ప్రచురణ: గుంటూరు ఆదివారం, 26 జూలై 2026 వెల: 2 రూ/- RNI No: APTEL/2023/88990

VOLUME: 3 ISSUE: 272 PAGES: 8 EDITOR: ROLLA RAGHUNATH REDDY PUBLISHED: GUNTUR SUNDAY, 26 JULY 2026 PRICE: 2 Rs/- BHARATH PRATHINIDHI




# ఆరోగ్యం మీ బాధ్యత!

## సంజీవని సద్వినియోగం చేసుకోండి!

- ప్రజల కోసం డిజిటల్ హెల్త్ ప్రొఫైల్
- సంక్షేమం నుంచి సౌర విద్యుత్ వరకు
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

2

మీ ఆరోగ్యం మీ బాధ్యత అని, ప్రభుత్వం తీసుకువస్తున్న సంజీవనిని సద్వినియోగం చేసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. ప్రజారోగ్య భద్రతే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు నుంచి సంజీవని అమలు చేయనున్నట్లు ప్రకటించారు. ప్రజారోగ్యం, ప్రజా సంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. గొడ్డలి పార్టీ నేతలు పగటి వేషగాళ్లని, వారు ఒక్క ఎకరాకు నీరివ్వలేదని, ఒక్క పరిశ్రమ కూడా తీసుకురాలేదని విమర్శించారు. శనివారం కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గంలోని ఆస్పరిలో నిర్వహించిన సంజీవని కార్యక్రమం బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు.

# స్మగ్లింగ్‌పై ఉక్కుపాదం

- అంతర్రాష్ట్ర స్మగ్లర్లతో పాటు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ అరెస్ట్
- ఎర్రచందనం అక్రమ రవాణాకు సహకరిస్తే కఠిన చర్యలే: పవన్ కళ్యాణ్




6 లో

## టమాటా ధరలపై తప్పుడు ప్రచారం తగదు



రాష్ట్రంలో టమాటా ధరలపై వాస్తవాలను వక్రీకరిస్తూ రైతులకు కిలోకు కేవలం రూ.2 మాత్రమే లభిస్తోందని వైఎస్సార్‌సీపీ చేస్తున్న ప్రచారం పూర్తిగా నిరాధారమని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విమర్శించారు. మార్కెట్ పరిస్థితులను ప్రభుత్వం ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ రైతులకు గిట్టుబాటు ధర లభించేలా చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు.

5 లో

## మరో 10 కరోనా కేసులు

### రాష్ట్రంలో మొత్తం కేసులు 49కు చేరిక

గుంటూరు జిల్లాలో అత్యధికంగా కొత్త కేసులు నమోదు





02

## ప్రహ్లాద్ జోషికి విద్యాశాఖ అప్పగింత

ధర్మేంద్రప్రధాన్ రాజీనామా ఆమోదం



## ఇది ముమ్మాటికీ విద్యార్థుల విజయం

గాంధీ నుంచే శాంతిని నేర్చుకున్నాం

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై అభిజిత్ దీప్కే

02

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా


## ఆందోళన విరమించిన కాక్రోచ్ జనతా పార్టీ

- మరో రెండు కీలక డిమాండ్లకు కేంద్రం అంగీకారం
- బాధిత విద్యార్థుల కుటుంబాలకు నష్టపరిహారం
- నిరసనకారులపై కేసులు ఎత్తివేస్తామన్న జేపీ నడ్డా



సీజేపీ పోరాటంతో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయక తప్పలేదు. గత పది రోజులుగా చోటు చేసుకుంటున్న పరిణామాల పట్ల కలత చెందానని ఆయన చెప్పారు. యువత ఆకాంక్షలను గౌరవిస్తున్నానని స్పష్టంచేశారు. ఇప్పటి పరిస్థితిని దేశ విద్రోహ శక్తులు అనుకూలంగా మార్చుకోవడానికి అవకాశం ఇవ్వొద్దన్న కారణంతోనే పదవి నుంచి తప్పుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు యువతకు ప్రధాన్ లేఖ రాశారు. ఢిల్లీలో పరిణామాలు శనివారం చకచకా జరిగిపోయాయి.





న్యూఢిల్లీ, జూలై 25 : ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. ఆయన స్థానంలో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషీకి విద్యా శాఖ మంత్రిగా అదనపు బాధ్యతలు అప్పగించింది. మరోవైపు కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్, సీజేపీ ప్రతినిధులు అశుతోష్ రాంకా, సౌరవ్ దాస్ మధ్య మూడో విడత చర్చలు జరిగాయి. సీజేపీ లేవనెత్తిన మరో రెండు కీలక డిమాండ్ల పట్ల కేంద్ర మంత్రులు సానుకూలంగా స్పందించారు. పేపర్ లీక్ కారణంగా ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం చెల్లించాలని, నిరసనకారులపై

-మిగతా 2 లో..




## చట్టసభల వయోపరిమితి 21 ఏళ్లకు తగ్గించాలి

### అప్పుడే యువతకు రాజకీయ అవకాశాలు వస్తాయి

- తెలంగాణ అసెంబ్లీలో ఈ మేరకు తీర్మానం చేస్తాం
- కాంగ్రెస్ కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న సిఎం రేవంత్

చట్టసభలకు పోటీ చేసే వయసును 21 ఏళ్లకు తగ్గించాలని సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపుతామన్నారు. యువత రాజకీయాల్లోకి రావాలని, అప్పుడే నీతిమంతమైన రాజకీయాలు సాగుతాయని అన్నారు. దేశంలో అధికారంలో వారు భాగస్వాములు కావాల్సి ఉందన్నారు. నీట్ ప్రశ్నపత్రాల లీకేజీకి వ్యతిరేకంగా ఢిల్లీలో ఆందోళన చేపట్టిన విద్యార్థులపై జరిగిన దాడిని నిరసిస్తూ హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్డులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ నేతృత్వంలో పీపుల్స్ ప్లాజా నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు.

హైదరాబాద్,జూలై25 : కొన్ని దేశాల్లో అమల్లో ఉన్న విధంగా భారత్‌లోనూ 21 ఏళ్లకే ఎంపీలు, ఎమ్మెల్యేలుగా పోటీ చేసే అవకాశం రావాలని రేవంత్‌రెడ్డి అన్నారు. రాహుల్ ప్రధాని అయితే.. చట్టసభలకు పోటీ చేసే వయసు 21 ఏళ్లకు తగ్గుతుందన్నారు. దేశంలో 30శాతం ఉన్న యువత చట్టసభలకు వెళ్లాలని ఆకాంక్షించారు. విద్యార్థుల పోరాటం ఫలితంగానే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. విద్యార్థులపై నమోదైన కేసులను వెంటనే తొలగించాలని, వారి విజయాన్ని కాంగ్రెస్ ఖాతాలో వేసుకోబోమని

-మిగతా 2 లో..

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా

## ప్రహ్లాద్ జోషికి విద్యాశాఖ అప్పగింత

### ధర్మేంద్రప్రధాన్ రాజీనామా ఆమోదం



**న్యూఢిల్లీ, జూలై 25 :** ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనంతరం విద్యాశాఖ బాధ్యతలను కేంద్ర ప్రభుత్వం మరో మంత్రి ప్రహ్లాద్ జోషికి అప్పగించింది. ప్రస్తుతం కన్స్యూమర్ ఎఫైర్స్ శాఖ మంత్రిగా ఉన్న ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించింది. ప్రధాని సలహా మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రహ్లాద్ జోషికి విద్యాశాఖను కేటాయిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఇక ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను కూడా రాష్ట్రపతి ఆమోదించారు. కర్ణాటకలోని ధార్వాడ్ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రహ్లాద్ జోషి.. ఆహార, ప్రజాసరఫరా వ్యవహారాలు, పునరుత్పాదక ఇంధన శాఖ వ్యవహారాలను కూడా పర్యవేక్షిస్తున్నారు. భారత్ చొరవతో ఏర్పాటు చేసిన ఇంటర్నేషనల్ సోలార్ అలయన్స్‌కు ప్రెసిడెంట్‌గా ఉన్నారు.

## ఇది ముమ్మాటికీ విద్యార్థుల విజయం

### గాంధీ నుంచే తాము శాంతిని నేర్చుకున్నాం

### ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై అభిజిత్ దీప్కే




**న్యూఢిల్లీ, జూలై 25 :** నీట్ పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన ఆందోళనల నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. దీనిపై సీజేపీ హర్షం వ్యక్తం చేసింది. 'ఇది విద్యార్థుల విజయం' అంటూ ఎక్స్‌లో పోస్ట్ చేసింది. ప్రధాన్ రాజీనామాతో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే మాట్లాడుతూ.. 'శాంతియుతంగా చేసే ఏ ఆందోళనతో అయినా లక్ష్యం తప్పకుండా నెరవేరుతుంది. దీన్ని గాంధీజీ నుంచి నేర్చుకున్నా. ఈ దేశ యువత శాంతియుత నిరసనలు వృథాగా పోలేదు. విద్యార్థుల పోరాటం ఫలించింది. వారి సత్తా ఏంటో తెలిసింది. ఈ విజయం విద్యార్థులందరిది. ప్రజాస్వామ్యం అంటే ఇదే అని ఆనందం వ్యక్తం చేశారు. మాకు రాజకీయాలు అవసరం లేదు. మా డిమాండ్లలో ఒకటి నెరవేరింది. మిగతా రెండూ నెరవేరే వరకు వేచి చూస్తాం. విద్యార్థులపై దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి. విద్యార్థులపై పెట్టిన అన్ని కేసులు పూర్తిగా ఎత్తివేయాలి. విద్యావ్యవస్థను ప్రక్షాళన చేసే వరకు ఈ ఉద్యమం ఆగదు. ఈ సాయంత్రం 6.30 గంటలకు కొవ్వొత్తులతో ర్యాలీ చేద్దాం అని సీజేపీ నేతలు యువతకు పిలుపునిచ్చారు.

## విద్యార్థుల పోరాటానికి తలొగ్గిన మోడీ

(మొదటిపేజీ తరువాయి)

కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గాల్సి వచ్చిందని ఆయన అన్నారు. విద్యార్థుల ఆవేదనను పట్టించుకోకుండా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరు తీవ్ర విమర్శలకు గురైందని, చివరకు ప్రజల ఒత్తిడి ముందు తలవంచక తప్పలేదని వ్యాఖ్యానించారు. ఇది కేవలం ఒక మంత్రి రాజీనామా మాత్రమే కాదని, ప్రజల గొంతుకకు లభించిన గౌరవమని పొన్నం ప్రభాకర్ అభిప్రాయపడ్డారు. ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేస్తే ఎంతటి ప్రభుత్వమైనా మూల్యం చెల్లించుకోక తప్పదని పేర్కొన్నారు. ఈ రోజు దిగివచ్చిన ప్రభుత్వం రేపు గద్దె దిగక తప్పదని కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. విద్యార్థుల ఆకాంక్షలను విస్మరించిన ప్రభుత్వాలకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల ఉద్యమానికి, కాంగ్రెస్ పార్టీతో పాటు బీజేపీయేతర రాజకీయ పక్షాల పోరాటానికి దక్కిన విజయమని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. విద్యార్థుల భవిష్యత్‌కు సంబంధించిన అంశాల్లో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయని, వాటి ఫలితంగానే ఈ పరిస్థితి వచ్చిందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల గొంతుకను ప్రభుత్వం గౌరవించక తప్పదని, విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ తన పదవి కాపాడుకోవడానికే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో రాజీనామా చేయించారని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ విమర్శించారు. నీట్ పరీక్ష లీక్ జరిగినప్పుడే కేంద్ర ప్రభుత్వం స్పందించి ఉంటే పరిస్థితి ఇంత వరకూ వచ్చేదే కాదన్నారు. మూడు నెలల పాటు ఎందుకు తాత్సారం చేశారని ప్రశ్నించిన ఆయన.. విద్యార్థులపై పెరిగిన ఒత్తిడి, నిరసనల కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నారని అన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల పోరాటానికి దక్కిన విజయమని పేర్కొన్నారు. యువత తమ దమ్ము ఏంటో నిరూపించారని, వారి పోరాట ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం దిగివచ్చిందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. ఉద్యమంలో పాల్గొన్న యువతపై నమోదైన కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనల నేపథ్యంలో ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. భవిష్యత్తులో పేపర్ లీకులు జరగకుండా కఠిన చర్యలు తీసుకుని విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా దేశ విద్యార్థులు, యువత పోరాటానికి దక్కిన విజయమని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. ఈ పరిణామంతో బీజేపీ పతనం ప్రారంభమైందని వ్యాఖ్యానించారు. విద్యార్థుల సమస్యలపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలని, నీట్ ప్రశ్నపత్రాల లీక్‌పై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. యువతకు న్యాయం జరిగే వరకు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. విద్యార్థుల సమస్యలను అర్థం చేసుకుని పరీక్షల నిర్వహణలో లోపాలను సరిదిద్దాలని కేంద్రాన్ని కోరారు. విద్యార్థుల డిమాండ్లకు కేంద్ర ప్రభుత్వం దిగివచ్చిందని ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల సుదీర్ఘ పోరాటానికి దక్కిన విజయమని పేర్కొన్నారు. ఈ పరిణామం ప్రస్తుత ప్రభుత్వాలతో పాటు భవిష్యత్తులో వచ్చే ప్రభుత్వాలకు కూడా ఒక కనువిప్పుగా మారాలని అన్నారు. విద్యార్థుల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ప్రభుత్వాలు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

## ధర్మేంద్ర రాజీనామా.. యువత సాధించిన విజయం: హరీష్



**హైదరాబాద్,జులై 25 :** నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో సీజీపీతోపాటు విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో వారి డిమాండ్ల మేరకు ధర్మేంద్ర ప్రధాన్ తలొగ్గుతూ కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. తమ మూడు డిమాండ్లు నెరవేరడంతో ఆందోళన విరమిస్తున్నట్టు సీజేపీ ప్రకటించింది. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు స్పందించారు. తాజా సందర్భాన్ని దేశంలోని యువతకు ఇది ఒక గొప్ప విజయంగా హరీశ్ రావు అభివర్ణించారు.. సామాజిక దృక్పథంలో వస్తున్న మార్పు నిజంగానే కనిపిస్తోంది. విద్యార్థులందరికీ అభినందనలు.. అంటూ ఎక్స్‌లో ట్వీట్ చేశారు. ఈ గొప్ప దేశంలోని విద్యార్థులు, యువత, 'జెన్-జెడ్' టీంకు అభినందనలు. ఈ విజయం మీదే. మీకు మా మద్దతును అందించినందుకు సంతోషంగా ఉంది.. అంటూ బీఆర్ఎస్ పార్టీ ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేసింది.

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా

(మొదటిపేజీ తరువాయి)



కేసులు కొట్టివే యాలని సీజేపీ డిమాండ్ చేయగా, ప్రభుత్వం అందుకు అంగీకారం తెలియజేసింది. మొత్తానికి మూడు కీలకమైన డిమాండ్లు నెరవేరడంతో కాక్రోచ్ జనతా పార్టీలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. శనివారం ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన తర్వాత ఆ పార్టీ సంబరాల్లో మునిగిపోయింది. ఆశించిన లక్ష్యం నెరవేరడంతో.. 49 రోజులుగా సాగుతున్న పోరాటాన్ని నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. నిరసన ప్రదేశాల నుంచి అందరూ శాంతియుతంగా వైదొలగాలని ఆ పార్టీ నేత సౌరవ్ దాస్ కోరారు. నిరసనకారులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరించుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని నడ్డా వెల్లడించారు. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు నిబంధనల మేరకు పరిహారం అందిస్తామని తెలిపారు. అయితే, ఎంత ఇస్తారన్నది ఆయన పేర్కొనలేదు. కేంద్ర మంత్రి రాజీనామా చేసిన సంగతి తెలియడంతో జంతర్‌మంతర్ వద్ద శనివారం పండుగ వాతావరణం నెలకొంది. నిరసనకారులు త్రివర్ణ పతాకాలు చేతబూని, కేరింతలు కొడుతూ నృత్యాలు చేశారు. 'చక్ దే ఇండియా'వంటి పాటలు వినిపిస్తుండగా, వారు ఒకరినొకరు ఆత్మీయంగా ఆలింగనం చేసుకోవడం కనిపించింది. చాలామంది డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటాలను, పోస్టర్లను ప్రదర్శించారు. మంత్రి రాజీనామాను తమ పోరాటానికి దక్కిన విజయంగా అభివర్ణించారు. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే జంతర్‌మంతర్ వద్ద జనాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. అనుకున్నది చేసి చూపించామని చెప్పారు. భయపడకపోతే గెలవవచ్చనడానికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామే నిదర్శనమని స్పష్టంచేశారు. సోనమ్ వాంగ్‌చుక్ సైతం స్పందించారు. ఇది ప్రజాస్వామ్య విజయమని పేర్కొన్నారు. శాంతి, సహనం, పట్టుదలకు దక్కిన విజయం అని తేల్చిచెప్పారు. సీజేపీకి, దేశంలోని జెన్ జెడ్‌కి అభినందనలు తెలియజేశారు. ప్రధాని మోదీ మొండితనం ఓడిపోయిందని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను 'విక్టరీ ఆఫ్ ట్రూత్'గా అభివర్ణించారు. "యువతకు ప్రధాని మోదీ క్షమాపణ చెప్పాలి. లాఠీలు, పెల్లెట్ గన్‌లతో దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి"అని ఖర్గే డిమాండ్ చేశారు. ప్రశ్నపత్రాల లీకేజీకి వ్యతిరేకంగా విద్యార్థులు చేపట్టిన ఆందోళన.. ప్రభుత్వాన్ని ఎవరూ తమ సొంత జాగీరులా నడపలేమని బీజేపీ--ఆర్ఎస్ఎస్ పాలకవర్గానికి హెచ్చరిక జారీ చేసిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఒకవేళ ప్రభుత్వాన్ని సొంత జాగీరుగా భావిస్తే ఇప్పుడు జరిగిన దానికంటే పది రెట్లు తీవ్రమైన పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని తేల్చిచెప్పారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అవినీతికి ప్రతీక అని అని మండిపడ్డారు. ఆయన వెళ్లిపోవడం మంచిదేనని చెప్పారు. ఆందోళన సమయంలో విద్యార్థులపై జరిగిన అకృత్యాలకు గాను ప్రధాని మోదీ క్షమాపణ చెప్పాలని రాహుల్ డిమాండ్ చేశారు. "ప్రజాస్వామ్యానికి ఇది గొప్ప విజయం, దేశ ప్రజలందరికీ అభినందనలు"అని ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ సోషల్ మీడియాలో పోస్టుచేశారు.

## చట్టసభల వయోపరిమితి 21 ఏళ్లకు తగ్గించాలి

(మొదటిపేజీ తరువాయి)



స్పష్టం చేశారు. విద్యార్థులపై పెట్టిన కేసులను వెంటనే తొలగించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పార్లమెంట్‌లో కాంగ్రెస్ ఎంపీలంతా ఇదే నినాదాన్ని వినిపించాలని సూచించారు. విద్యార్థుల పోరాటం వల్లే కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేశారని, ఇది యువత సాధించిన విజయమని అన్నారు. విద్యార్థుల మొహాల్లో కనిపిస్తున్న ఆనందమే అసలైన విజయమని సీఎం రేవంత్ పేర్కొన్నారు. చప్పన్ ఇంచ్ ఛాతీ అంటూ గొప్పలు చెప్పుకునే నాయకత్వం.. దేశ యువత ముందు ఓడిపోయిందని విమర్శించారు. అయితే విద్యార్థులపై నమోదైన కేసులు ఇంకా తొలగించలేదని, వెంటనే వాటిని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. నీట్ కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పరామర్శించలేదని ఆరోపించారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించే వరకూ వారి తరఫున కాంగ్రెస్ పోరాటం కొనసాగిస్తుందని సీఎం స్పష్టం చేశారు. విద్యార్థుల పోరాటానికి కేంద్ర ప్రభుత్వం దిగివచ్చిందని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. కేంద్రం మెడలు వంచినందుకే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారని పేర్కొన్నారు. మోదీ చరిష్మా తగ్గిందని, ఆయన చర్యలను ప్రపంచం ఖండించిందని వ్యాఖ్యానించారు. జెన్ జీ యువతకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించాలని మహేష్ గౌడ్ అన్నారు. 21 ఏళ్లకే చట్టసభల్లోకి వచ్చే అవకాశం కల్పించేలా చట్టం తీసుకురావాలని, ఈ మార్పును తెలంగాణ నుంచే ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సహా పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు, జెన్ జీలు పాల్గొన్నారు.

## అధికారంలో ఉన్నవారి కంటే ప్రజాశక్తి ఎప్పుడూ గొప్పదే

### ధర్మేంద్ర రాజీనామాపై కెటిఆర్ పోస్ట్




**హైదరాబాద్,జులై 25 :** యావత్ దేశాన్ని కుదిపేసిన నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై సీజీపీ కాంక్రోచ్ జనతా పార్టీతోపాటు విద్యార్థుల ఆందోళనలు చేపట్టిన నేపథ్యంలో వారి డిమాండ్ల మేరకు ధర్మేంద్ర ప్రధాన్ తన కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. తమ మూడు డిమాండ్లు నెరవేరడంతో ఆందోళన విరమిస్తున్నట్టు సీజేపీ ప్రకటించింది. ఈ మేరకు కేంద్రం సీజేపీ నేతలను చర్చలకు కూడా ఆహ్వానించింది. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. అధికారంలో ఉన్నవారి కంటే ప్రజల శక్తి ఎప్పుడూ గొప్పది. జెన్ జి ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేశారు. ఢిల్లీలో విద్యార్థులు, యువతపై కేంద్ర ప్రభుత్వం చేసిన దాష్టీకానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద శుక్రవారం నిర్వహించిన భారీ నిరసన కార్యక్రమానికి మహానగరంతో పాటు రాష్ట్ర నలుమూలల నుంచి వేలాది మంది యువతీ యువకులు దండుకట్టి తరలివచ్చారని తెలిసిందే. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరై భావోద్వేగంతో ప్రసంగించారు. 'పరీక్ష పే చర్చ పెట్టిన మీరు పేపర్ లీకేజీలపై ఎందుకు పెట్టలేదు? ఏటా 2 కోట్ల ఉద్యోగాల హామీ ఏమైంది?' అని కేంద్రాన్ని నిలదీశారు. ఢిల్లీలో పిల్లలపై దాడులను చూస్తుంటే ఇద్దరు పిల్లల తండ్రినైన తన మనస్సు చలించిపోతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. మోదీ, రేవంత్ ప్రభుత్వాలపై తనదైన శైలిలో పంచులు విసిరారు. ఢిల్లీలో యువతపై మోదీ సర్కార్ సాగిస్తున్న దమనకాండను కండ్లకుకట్టారు. రేవంత్ దాగుడు మూతలను ఎత్తిచూపారు. ఢిల్లీ వీధుల్లో న్యాయం కోసం పోరాడుతున్న యువకులపై ఉగ్రవాదులు, దేశద్రోహులు, పాకిస్థాన్ నుంచి నిధులు వస్తున్నాయని అడ్డగోలుగా మాట్లాడుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. నిజంగానే కేంద్రానికి బాధ్యత ఉంటే ఉద్యమిస్తున్న విద్యార్థుల వద్దకెళ్లి చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాల్సి ఉండేదన్నారు.




## రియల్ ఎస్టేట్ రంగంపై గోబెల్స్ ప్రచారం నమ్మొద్దు

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడుతూ గత రెండున్నర సంవత్సరాల ప్రజా ప్రభుత్వ పాలనలో సుమారు 15 నుంచి 20 శాతం రియల్ ఎస్టేట్ అభివృద్ధి జరిగిందని , 40 శాతం వరకు విక్రయాలు వృద్ధిచెందాయని అన్నారు. గడచిన పదేళ్లతో పోలిస్తే ఈ రెండున్నర ఏళ్లలో రెసిడెన్షియల్ మార్కెట్ విశేషంగా పెరిగిందని, దీనికి సంబంధించి తమ స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ శాఖలో పెరిగిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల సంఖ్యనే నిదర్శనమన్నారు. రియల్ ఎస్టేట్ పడిపోయిందని కొంతమంది పనిగట్టుకొని ఈ ప్రభుత్వంపై బురద చల్లేందుకు ఈ గోబెల్స్ ప్రచారం సాగిస్తున్నారని వాటిని పట్టించుకోవద్దని మంత్రి అన్నారు. 2004 నుంచి 2014 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో నాటి కాంగ్రెస్ ముఖ్యమంత్రుల చొరవ కారణంగానే హైదరాబాద్ ఒక రోల్ మోడల్‌గా రూపొందిందని, వారి దూరదృష్టి వల్లే ఓఆర్ఆర్, అంతర్జాతీయ విమానాశ్రయం, ఐటీ సెక్టార్ తదితరాలు 360 డిగ్రీల కోణంలో అభివృద్ధి చెందాయని వివరించారు. అందువల్లే హైదరాబాద్ ఇప్పుడు దేశంలోనే గాక ప్రపంచంలోనే అందరి దృష్టిని ఆకర్షిస్తోందని, ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారితో కలసి దావోస్ వెళ్లినపుడు అక్కడ కూడా అధికశాతం పారిశ్రామిక వేత్తలు హైదరాబాద్ లో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నారన్నారు. హైదరాబాద్ నగరం పెట్టుబడులకు గమ్యస్థానం అవుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి దూరదృష్టితో ప్రణాళికా బద్ధంగా హైదరాబాద్ నగరాభివృద్ధికి చర్యలు చేపట్టారు. 7వేల కోట్లతో చేపడుతున్న మూసీ ప్రాజెక్ట్ సుందరీకరణ పట్టాలెక్కనుందని మంత్రి పొంగులేటి తెలిపారు. 28 కిలోమీటర్ల తొలి విడత అభివృద్ధికి వారం పది రోజుల్లో టెండర్లు పిలవబోతున్నామని చెప్పారు. అదేవిధంగా పాత బస్తీ తదితరాలను కలుపుతూ రెండవ విడతగా 76 కిలోమీటర్ల మేర 24వేల కోట్లరూపాయిల ఖర్చుతో మెట్రో విస్తరణ కార్యక్రమం ప్రారంభం కానుందని తెలిపారు. ఇవేగాక ట్రిబుల్ ఆర్ నుంచి ఓఆర్ఆర్ కలుపుతూ రేడియల్ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయని తెలిపారు.ప్రపంచంలోనే సుందరనగరమైన హైదరాబాద్ ను రియల్ ఎస్టేట్ రంగం పక్షాన కూడా మరింత అభివృద్ధి చెందడానికి రియల్ ఎస్టేట్ రంగ ప్రతినిధులు సహకారం అవసరమని, ప్రజలకు నమ్మకంగా, సకాలంలో ఎ÷--లాట్లను అందించి వారి అభిమానాన్ని చూరగొనాలని మంత్రి హితవు పలికారు. రాష్ట్రంలో భూముల భద్రత , భరోసా కల్పించేందుకు భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామని , వీటిలో కొన్ని చిన్న చిన్నసమస్యలను సాఫ్ట్ వేర్ పరంగా 15-20 రోజుల్లో సరిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. కేవలం రియల్ ఎస్టేట్ రంగం కోసమే గాకుండా పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు క్యూర్ పరిధిలో తొలివిడతగా లక్ష ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు నిర్ణయించామని, దీని తర్వాత దఫదఫాలు ఇళ్ల మంజూరు ఉంటుందని మంత్రి చెప్పారు. ప్రజలకు ఇళ్ల నిర్మాణానికి 2-3 లక్షల చదరపు అడుగుల స్థల సేకరణకు ప్రయత్నిస్తున్నామని చెబుతూ రియల్ ఎస్టేట్ రంగ ప్రతినిధుల కోరిక మేరకు ఫాస్ట్ ట్రాక్ సౌకర్యాన్ని కల్పించేందుకు ప్రయత్నిస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రఘురామ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇంద్రకీలాద్రిపై వైభవంగా ఆషాఢ ఉత్సవాలు

### 27, 28, 29 తేదీల్లో శాకంబరీ ఉత్సవాలకు సన్నాహాలు

**విజయవాడ,జులై25 :** ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మవారి ఆలయంలో ఆషాడ ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఈ నెల 27, 28, 29 తేదీల్లో నిర్వహించనున్న శాకంబరీ ఉత్సవాలకు దేవస్థానం సన్నాహాలను ముమ్మరం చేసింది. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు శ్రీ శాకంబరీదేవి అలంకారంలో ఆకు కూరలు, కూరగాయలు, పండ్లతో అలంకరించబడిన ప్రకృతి మాత స్వరూపంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఉత్సవాల తొలి రోజు అలంకరణ కోసం శ్రీ దుర్గా మల్లేశ్వర హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ వ్యాపారులు, దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుడు బడేటి ధర్మారావు అధ్వర్యంలో తొలి విడతగా 7 టన్నుల కూరగాయలను దేవస్థానానికి అందజేశారు. శనివారం సాయంత్రం మహామండపం ఆరో అంతస్తులో దేవస్థానం చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్ అమ్మవారికి కూరగాయలను సమర్పించగా, ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శాకంబరీ అలంకరణ కోసం కూరగాయల దండల తయారీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈవో వి.కె. శీనా నాయక్ మాట్లాడుతూ, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని తాడేపల్లిగూడెం, తణుకు, మడికి, సిద్దాంతం, ఏలూరు ప్రాంతాలతో పాటు గుంటూరు జిల్లా జాగర్లమూడి, తెనాలి, యడ్లపల్లి, నారాకోడూరు, గుంటూరు, కృష్ణా జిల్లా నూజివీడు, చినఓగిరాల, పెదఓగిరాల ప్రాంతాల రైతుల నుంచి వివిధ రకాల కూరగాయలను సేకరించి దేవస్థానం బస్సుల ద్వారా ఇంద్రకీలాద్రికి తరలిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఏడాది నిర్వహించే శాకంబరీ ఉత్సవాలు ఇంద్రకీలాద్రిలో అత్యంత వైభవంగా జరుగుతాయని, ఈ మూడు రోజుల పాటు వేలాది మంది భక్తులు అమ్మవారిని ప్రకృతి మాత స్వరూపంలో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారని దేవస్థానం అధికారులు తెలిపారు.

భారత్ ప్రతినిధి
తెలుగు దిన పత్రిక

గుంటూరు వార్తలు
ఆదివారం, 26 జూలై 2026



# గ్రీన్ గుంటూరు – నవ గుంటూరు లక్ష్యంగా సమగ్ర అభివృద్ధి



కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని

**గుంటూరు, 25 జూలై 2026, భారత్ ప్రతినిధి :** "గ్రీన్ గుంటూరు-నవ గుంటూరు" అనే వినూత్న కార్యక్రమాల ద్వారా గుంటూరు నగరాన్ని హరిత నగరంగా తీర్చిదిద్దుకోవడానికి అవకాశం ఉందని, ప్రజలకు ఆరోగ్యం, ఆహ్లాదం అందించే కార్యక్రమాల్లో అధికారులతోపాటు ప్రజలు విరివిగా పాల్గొనాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. శనివారం గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఇన్నర్ రింగ్ రోడ్ లోని శిల్పారామం దగ్గర "నవ గుంటూరు", "గ్రీన్ గుంటూరు" కార్యక్రమాల ప్రారంభ సూచికంగా మొక్కలు నాటి, పోస్టర్స్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది.

**ఈ సందర్భంగా కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ,** 2047 నాటికి దేశంలో 50 శాతం గ్రీన్ కవర్ సాధించాలన్నప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయాలకు అనుగుణంగా గుంటూరు నగరాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. ప్రస్తుతం గుంటూరు ప్రాంతంలో కేవలం 7.2 శాతం మాత్రమే గ్రీన్ కవర్ ఉందని, రహదారుల విస్తరణ మరియు సరియైన నిర్వహణ లేకపోవడం వల్ల చెట్లు తగ్గిపోతున్నాయని పేర్కొన్నారు. ఈ పరిస్థితిని మార్చి, గుంటూరును హరితమయంగా మార్చేందుకు జిల్లా కలెక్టర్ మరియు నగర కమిషనర్ ఆధ్వర్యంలో "గ్రీన్ గుంటూరు", "నవ గుంటూరు" అనే వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. 'గ్రీన్ గుంటూరు' ప్రణాళికలో భాగంగా గుంటూరు పార్లమెంట్ పరిధి వ్యాప్తంగా 1,20,000 మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం కోసం అర్బన్ స్థానిక సంస్థలు, పంచాయతీ, జెడ్పీ నిధులతో పాటు సీఎస్ఆర్ మరియు వివిధ స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో నిధులు సమకూర్చి మొక్కలను తీసుకువచ్చారన్నారు. కేవలం మొక్కలు నాటడమే కాకుండా, వాటి సంరక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ 90వేల మొక్కలకు ట్రీ గార్డ్సును ఏర్పాటు చేస్తున్నారన్నారు. నాటిన ప్రతి మొక్క సురక్షితంగా పెరిగేలా, ఎదిగే అవకాశం ఎక్కువగా ఉండే 3 అడుగుల ఎత్తు ఉన్న మొక్కలను ఎంచుకోవడంతో పాటు, వాటికి జియో-ట్యాగింగ్ చేసి మొబైల్ యాప్ ద్వారా నిరంతరం పర్యవేక్షించేలా కచ్చితమైన సాంకేతిక వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయం అన్నారు. ఖాళీగా ఉన్న స్థలాలను నగరవాసులకు ఉప యోగపడేలా పార్కులుగా, ఆహ్లాదకరమైన ప్రదేశాలుగా మారు స్తున్నారని, గోడలపై పోస్టర్లు అంటించకుండా సంస్కృతి ఉట్టి పడేలా అందమైన పెయింటింగ్స్ వేయిస్తున్నామని, త్వరలోనే గుంటూరులో "స్ట్రీట్ ఆర్ట్ ఫెస్టివల్" కూడా నిర్వహించ బోతున్నామని తెలిపారు. నగరంలో మౌలిక వసతుల కల్పనలో భాగంగా, రాబోయే 30 సంవత్సరాల నీటి అవసరాలను తీర్చేం దుకు రూ. 500 కోట్ల వ్యయంతో చేపడుతున్నభారీ తాగునీటి ప్రాజెక్టును శనివారం ప్రారంభించ బోతున్నట్లు ప్రకటించారు. వచ్చే 5 నుండి 10 సం లో గుంటూరు నగరాన్ని రోడ్లు, డ్రైనేజీలు, మంచి నీరు, పచ్చదనంతో సమగ్రంగా అభివృద్ధి చేసి 'వికసిత్ భారత్' ప్రమాణాలకు తగ్గట్టుగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ, పర్యావరణాన్ని కాపాడాలి అనే తపనతో వచ్చిన పెద్దలకు నమస్కారాలు, విద్యార్థులకు అభినందనలు తెలుపుతున్నామన్నారు.

**నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ మాట్లాడుతూ,** గుంటూరు నగర పచ్చదనం, పరిశుభ్రత మరియు సమగ్ర అభివృద్ధిని కాంక్షిస్తూ శనివారం రెండు ప్రతిష్టాత్మక కార్యక్రమాలను ప్రారంభించామని, అందులో మొదటిది 'గ్రీన్ గుంటూరు' కాగా, ఈ ప్రచారం ద్వారా జిల్లా వ్యాప్తంగా దాదాపు 1,20,000 మొక్క లను నాటాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు పేర్కొన్నారు. నాటిన మొక్కల మనుగడ రేటు 80% నుండి 90% వరకు ఉండేలా, కనీసం 6 నుండి 10 అడుగుల ఎత్తున్న పెద్ద మొక్క లను నాటబోతున్నామన్నారు. ప్రధాన రహదారుల ఇరువైపులా అవెన్యూ ప్లాంటేషన్, చెరువుల వద్ద ట్యాంక్ బండ్స్ మరియు ఖాళీ స్థలాలలో బ్లాక్ ప్లాంటేషన్ ద్వారా వాతావరణానికి అనుకూలమైన మొక్కలను పెంచుతామని చెప్పారు. ఆగస్టు 15 నాటికి ఈ లక్ష్యాన్ని పూర్తి చేయడానికి ప్లానింగ్, ప్రొక్యూర్మెంట్ పనులు ఇప్పటికే పూర్తయ్యాయని, కార్పొరేషన్ తరఫున అద నంగా మరో 5,000 మొక్కలను ఉచితంగా పంపిణీ చేస్తున్నా మని తెలిపారు. పౌరులందరూ ఈ మొక్కలను సంరక్షిస్తూ తమ ఇళ్ల వద్ద కూడా మొక్కలు నాటాలని కోరారు. రెండోది 'నవ గుంటూరు' క్యాంపెయిన్ అని, గుంటూరును దేశంలోనే అత్యుత్తమ నగరాలలో ఒకటిగా, స్మార్ట్, క్లీన్, బ్యూటిఫుల్ మరియు క్లైమేట్ రెసిలియంట్ సిటీగా తీర్చిదిద్దడమే దీని ప్రధాన ఉద్దేశమని తెలిపారు. పౌరులందరూ భాగస్వామ్యులై సహకరిస్తేనే గుంటూరును 'గ్రీన్ అండ్ క్లీన్ నవ గుంటూరు'గా మార్చ గలుగుతామని తెలిపారు.

**ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ,** గుంటూరు నగరానికి ఇప్పటివరకు ఉన్న 'కారం బ్రాండ్' గుర్తింపుతో పాటు, రాబోయే రోజుల్లో పచ్చదనంతో శోభిల్లే 'నవ గుంటూరు'గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని రూపకల్పన చేశారన్నారు. గుంటూరు నగరాన్ని సుందరంగా మార్చేందుకు మరియు పర్యావరణాన్ని పరిరక్షించేందుకు 35 ఏళ్ల పరిపాలనా అనుభవంతో పలు సూచనలు చేయడం జరిగిందన్నారు. ముఖ్యంగా నగరవాసులు తమ ఇళ్లలో పుట్టినరోజు వేడుకలు జరుపుకునేటప్పుడు కేవలం కేక్ కట్ చేయడానికే పరిమితం కాకుండా, సమీప ప్రాంతాల్లో లేదా తమ ఇంటి ఆవరణలో ఖచ్చితంగా ఒక మొక్క నాటి దానిని కాపాడుకోవాలని కోరారు. గుంటూరు నగర అభివృద్ధికి అవసరమైన సాంకేతిక పద్ధతులను మరియు నూతన విధానాలకు ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తే 'గ్రీన్ గుంటూరు' కల సుసాధ్యమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ,** గత 20 ఏళ్లలో గుంటూరు నగరం వేగంగా అభివృద్ధి చెంది, ఖాళీ స్థలాలన్నీ బిల్డింగులుగా మారడం వల్ల పచ్చదనం తగ్గిపోతోందని, అందుకే కనీసం 30% నుండి 50% వరకు పచ్చదనాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు. నగరాన్ని క్లీన్‌గా ఉంచుకోవడమనేది కేవలంఅధికారులు లేదానాయకులబాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడు, విద్యాసంస్థలు, అపార్ట్‌మెంట్ అసోసియేషన్లు మరియు కార్పొరేట్ సంస్థలు ఇందులో భాగస్వాములు కావాలని కోరారు. ముఖ్యంగా ప్లాస్టిక్ లేదా ఇతర వస్తువుల పునర్వినియోగం, పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన పెంచేందుకు పాఠశాలల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపిఐడిసి చైర్మన్ డేగల ప్రభాకర్, హజ్ కమిటీ చైర్మన్ హసన్ భాష, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్పర్సన్ వందనాదేవి, జిఎంసి అదనపు కమిషనర్ ఐ.కిషోర్, డ్వామా పిడి శంకర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈఈ నజీనా బేగం గ్రీన్ గుంటూరు స్వచ్ఛంద సంస్థ నుండి ప్రభాకర్, ఆనందకుమార్, వైహెచ్ఏఐ నుండి కొండలరావు, నాగేశ్వరరావు, డిప్యూటీ కమిషనరు పాల్గొన్నారు.

# ప్రతి గడపకూ వెళదాం.. పాలన విజయాలను వివరిద్దాం : ఎమ్మెల్యే నసీర్

**గుంటూరు, 25 జూలై 2026, భారత్ ప్రతినిధి :** సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో సంక్షేమం, అభివృది, పరిపాలన, మౌలిక సదుపాయాలు, ప్రజా సేవల పంపిణీలో సాధించిన విజయాలను ప్రజలకు నేరుగా వివరించడానికి 27 నుంచి ఇంటింటికీ ప్రచారం కార్యక్రమం చేపట్టామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. శనివారం స్థానిక తూర్పు కార్యాలయంలో పార్టీ నాయకులతో ఎమ్మెల్యే ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటి ప్రచారం కార్యక్రమం ప్రణాళికపై చర్చించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కేడర్ అంతా కచ్చితంగా పాల్గొనాలని సూచించారు. ప్రజలకు కూటమి ప్రభుత్వం చేసిన మంచి ప్రజలకు తెలియజేయాలన్నారు. 45 రోజులపాటు పండుగలా



నిర్వహించాలని చెప్పారు. ప్రచార సమయంలో ప్రతి బూత్ నుంచి కనీసం 50 మంది కారకర్తలను మై టీడీపీ యాప్ లో నమోదు చేయాలన్నారు. ప్రతి రోజూ 30 గృహాలను సందర్శించాలని చెప్పారు. ఒక్కో ఇంటి వద్ద కనీసం 3 నిమిషాలు కేటాయించాలని, ప్రభుత్వ పాలనలో అభివృద్ధి సంక్షేమం గురించి వివరించాలని తెలిపారు. ఇదే సమయంలో ప్రజల నుంచి సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాన్ని లీడర్ నుంచి కేడర్ వరకు బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలనే కాకుండా ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలను అమలు చేశామన్నారు. రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించి, సంక్షేమ పథకాల ఫలాలను నేరుగా ప్రజల గుమ్మం ముంగిటకే చేర్చామని తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, దీపం-2 పథకం, స్త్రీశక్తి పథకం, సూపర్ సిక్స్ అమలు వంటి పథకాలు సమర్థవంతంగా అమలు చేశామన్నారు. తాజాగా తల్లి వందనంతో ప్రతి విద్యార్థికీ నిధులు అందించామని చెప్పారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామని, వీటిని ప్రజలకు తెలియజేయాలని సూచించారు.

# అభయ ఆటో యాప్ ను ఆవిష్కరించిన ఎస్పీ




**గుంటూరు, 25 జూలై 2026, భారత్ ప్రతినిధి :** ప్రయాణికుల భద్రత కోసం గుంటూరు జిల్లా పోలీస్‌శాఖ రూపొందించిన 'అభయ ఆటో గుంటూరు' మొబైల్ యాప్ను ఎస్పీ వకుల్ జిందల్ శనివారం నగరంపాలెం పోలీసు కళ్యాణ మండపంలో ఆవిష్కరించారు. మహిళలకు ఈ యాప్ ఆపన్నహస్తంలా ఉపయోగపడుతుందని ఎస్పీ అన్నారు. ఆటోల్లో పోగొట్టుకున్న వస్తువుల రికవరీకూ ఇది తోడ్పడుతుందని, ఎక్కువ మంది ఆటో డ్రైవర్లు నిజాయితీగా సేవలందిస్తున్నారని ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ డిఎస్పి బెల్లం శ్రీనివాసరావు, ఎస్‌బిడి ఎస్‌పి అలహరి శ్రీనివాసరావు, వెస్ట్ ట్రాఫిక్ సిఐ సింగయ్య, ఈస్ట్ ట్రాఫిక్ సీఐ అశోక్, ఐటీ కోర్ ఇన్స్పెక్టర్ నిస్సార్ భాష, యాప్ తయారీలో సహకరించిన పెంచల రెడ్డి శేఖర్ కమ్యూనికేషన్స్ ప్రతినిధులు, ఆటో డ్రైవర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపులో ఈస్ట్ ట్రాఫిక్ సీఐ అశోక్ విచ్చేసిన మీడియా ప్రతినిధులకు, అధికారులకు మరియు ఆటో డ్రైవర్లకు ధన్యవాదాలు తెలియజేశారు.

# పాలిటెక్నిక్ మరియు ఐటిఐ కళాశాలల ప్రాంగణాన్ని పరిశీలించిన కలెక్టర్

**గుంటూరు, 25 జూలై 2026, భారత్ ప్రతినిధి :** తెనాలి పాలిటెక్నిక్ కళాశాల, ఐటిఐ ప్రాంగణాన్ని జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ పరిశీలించారు. శనివారం తెనాలి పర్యటనలో భాగంగా పాలిటెక్నిక్, ఐటిఐ కళాశాలలను సందర్శించారు. కళాశాలల ప్రాంగణంలో వాతావరణాన్ని పరిశీలించి, మౌలిక వసతులను అడిగి తెలుసుకున్నారు. ప్రణాళి కాబద్ధంగా పనులు చేపట్టి మంచి వాతావరణం ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెనాలి రెవిన్యూ డివిజనల్ అధికారి కె. శ్రీ రమణి, తాసిల్దార్ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# నీట్ విద్యార్థులపై దాడికి నిరసనగా కాంగ్రెస్ భారీ కొవ్వొత్తుల ర్యాలీ

బాధ్యులపై నాన్-బెయిలబుల్ కేసులు నమోదు చేయాలి
జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు యన్నం సుధీర్ బాబు

**గుంటూరు, 25 జూలై 2026, భారత్ ప్రతినిధి :** నీట్ పరీక్షల సందర్భంగా విద్యార్థులపై జరిగిన దాడిని తీవ్రంగా నిరసిస్తూ గుంటూరు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నగరంలో భారీ కొవ్వొత్తులర్యాలీ నిర్వహించారు. ఆందోళన కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు యన్నం సుధీర్ బాబు నాయకత్వం వహించారు. నగరంలోని ఇమని సెంటర్ నుండి మహాత్మా గాంధీ విగ్రహం వరకు చేతుల్లో కొవ్వొత్తులు పట్టుకుని నాయకులు, కార్యకర్తలు ప్రధాన రహదారుల గుండా నినాదాలతో హోరెత్తిస్తూ భారీ ర్యాలీగా తరలివెళ్లారు. బాధిత విద్యార్థులకు వెంటనే న్యాయం చేయాలని, దాడికి పాల్పడిన వారిని తక్షణమే అరెస్ట్ చేయాలని పెద్ద ఎత్తున డిమాండ్ చేశారు.




**డీసీసీ అధ్యక్షుడు యన్నం సుధీర్ బాబు మాట్లాడుతూ** విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే అత్యంత కీలకమైన పరీక్షల సమయంలో వారిపై భౌతిక దాడులు జరగడం రాష్ట్రంలో శాంతిభద్రతల క్షీణతకు అద్దం పడుతోందని మండిపడ్డారు. విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు పూర్తిస్థాయి రక్షణ కల్పించడంలో ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం ఘోరంగా విఫలమయ్యాయని ఆరోపించారు.

**ముఖ్య డిమాండ్లు:** తక్షణ అరెస్టులు: దాడికి పాల్పడిన నిందితులను వెంటనే గుర్తించి, వారిపై నాన్-బెయిలబుల్ కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలి.

**భద్రతా హామీ:** పరీక్షా కేంద్రాలు, విద్యాసంస్థల వద్ద విద్యార్థులకు ఎలాంటి భయాందోళనలు లేకుండా పూర్తి రక్షణ కల్పించాలి. నిరసన కార్యక్రమానికి ప్రజాసంఘాల ప్రతినిధులు, విద్యార్థి నాయకులు, మేధావులు, ప్రజాస్వామ్యవాదులు, విద్యార్థి-యువజన సంఘాల నేతలు, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొని పూర్తి సంఘీభావం తెలిపారు. ఈకార్యక్రమంలో గుంటూరు నగర కాంగ్రెస్ అధ్యక్షుడు ఖలీల్, మాజీ శాసనసభ్యులు ఈశ్వరరావు, పీసీసీ సభ్యులు గంటా వినయ్, పాల్, రత్తయ్య, టోపీబాబు, ప్రముఖ నాయకులు కిరణ్, సాంబశివరావు, రామకృష్ణ, మహబూబ్, తులసి రామ్, ఇంతియాజ్, బ్రహ్మం, రాము, నరేష్, యలమంద, రాధికా, బిఎస్‌పి వాసు, చీప్తి, శ్రీనివాస్, వెంకట్ రెడ్డిలతో పాటు అనుబంధ సంఘాల కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# రహదారి భద్రతకు సమన్వయంతో చర్యలు చేపట్టాలి : జిల్లా కలెక్టర్

**గుంటూరు, 25 జూలై 2026, భారత్ ప్రతినిధి :** జిల్లాలో రహదారి ప్రమాదాలను నివారించి, ప్రజల ప్రాణాలను కాపాడేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో రహదారి ప్రమాదాల పరిస్థితి, ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలు, బ్లాక్ స్పాట్ల వద్ద తీసుకుంటున్న చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, రహదారుల భద్రతా ప్రమాణాలపై జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఇతర అధికారులతో సమీక్షించారు. ముందుగా సమావేశ ఉద్దేశాలను ఉప రవాణా కమీషనర్ సీతారామిరెడ్డి వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రమాదాలకు కారణమవుతున్న అంశాలను గుర్తించి, వాటి నివారణకు తక్షణచర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో అవసరమైన హెచ్చరిక బోర్డులు, రోడ్ మార్కింగ్‌లు, స్ట్రీట్ లైటింగ్, స్పీడ్ బ్రేకర్లు తదితర భద్రతా చర్యలను పరిశీలించి చేపట్టాలని తెలిపారు. ముఖ్యంగా రాజధాని అమరావతిలో నిర్మాణ పనులు చేసే కంపెనీల వాహనాలు అతివేగంతో తిరుగుతున్నాయని, వాటికి కచ్చితంగా స్పీడ్ గవర్నర్లను ఏర్పాటు చేయాలన్నారు. అదేవిదంగా వివిధ రకాల మెటీరియల్‌ను తీసుకువెళ్లేప్పుడు రోడ్లపై పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లా పరిధిలోని నేషనల్ హైవే పై విద్యుత్ దీపాలు సరిగా వెలగడం లేదని వెంటనే తగు చర్యలు తీసుకోవాలన్నారు. నేషనల్ హైవే లో సర్వీస్ రోడ్ల దగ్గర స్పీడ్ బ్రేకర్లను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని, ముఖ్యంగా హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం, మద్యం సేవించి వాహనాలు నడపకపోవడం, అతివేగాన్ని నియంత్రించడం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదాలు సంభవించినపుడు అత్యవసర సేవలు వేగంగా అందేలా పోలీస్, రవాణా, వైద్య, ఆర్అండ్‌బీ, మున్సిపల్ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. రహదారి భద్రత విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా, ప్రమాదాల నివారణే లక్ష్యంగా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. పోలీస్ సూపరింటెండెంట్ వకుల్ జిందల్ మాటాడుతూ, మేడికొండూరు వెళ్ళే రహదారిపై రాత్రి సమయంలో డివైడర్ స్పష్టంగా కనిపించడం లేదని, తద్వారా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. సాయంత్రం 3 గం నుండి రాత్రి 9 గం వరకు ఎక్కువ నిఘా పెడుతున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్ టి ఓ శ్రీహరి రావు, ఆర్ అండ్ బి ఎస్ ఈ శ్రీనివాస మూర్తి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. విజయలక్ష్మి, జిల్లా ప్రజా రవాణా అధికారి సామ్రాజ్యం, ఎన్ హెచ్ ఏ ఐ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నగరంపాలెం సీఐగా మునిపల్లి రాజేష్ బాధ్యతల స్వీకారం

ఎస్పీ వకుల్ జిందాల్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన సీఐ



**గుంటూరు, 25 జూలై 2026, భారత్ ప్రతినిధి :** గుంటూరు నగరంలోని నగరంపాలెం పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ)గా మునిపల్లి రాజేష్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఐపీఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

**ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ,** ప్రజలకు మరింత మెరుగైన పోలీసు సేవలు అందించేందుకు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో సమర్థవంతంగా వ్యవహరించడంతో పాటు ప్రజలతో స్నేహ పూర్వక పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని ఆకాంక్షించారు. మునిపల్లి రాజేష్ గతంలో ప్రకాశం జిల్లాలో సీఐగా సేవలందించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా గుంటూరు జిల్లాకు బదిలీ కాగా, నగరంపాలెం సీఐగా బాధ్యతలు చేపట్టి విధులు ప్రారంభించారు. కొత్త బాధ్యతల్లో సమర్థ వంతంగా పనిచేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండే పోలీసింగ్ అందించేందుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు.

## మరిడిబాంబ అమ్మవారికి శాకంబరి అమ్మవారిగా పూజలు



**కొత్తవలస, 25 జూలై 2026, భారత్ ప్రతినిధి :** విజయనగరం జిల్లా కొత్తవలస మండలం రాజాపాత్రపాలెంలో శనివారం తెల్లవారుజాము నుండి మరిడిబాంబ అమ్మవారు ధూప దీప నైవేద్యంతో భక్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకున్నారు. మొక్కలు పసుపు కుంకలతో గాజులు అమ్మవారికి సమర్పించుకున్నారు. ఆలయం ధర్మకర్తలు మాట్లాడుతూ ఇమంది శ్రీను. ఇమంది లక్ష్మి దంపతులు, అమ్మవారికి ఆషాడ మాసంలో తొలి ఏకాదశి రోజున మరిడి బాంబ అమ్మవారికి శాకంబరి కూరగాయలతో అలంకారం చేసి అమ్మవారి పూజలు అందుకుంటురు. ఈ అమ్మవారు రాజా పాత్ర పాలెం లో గ్రామంలో నిలిచింది రెండు సంవత్స రాల నుండి అమ్మవారికి ప్రత్యేకపూజలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం దూర విద్యా ప్రవేశం



**కొత్తవలస, 25 జూలై 2026, భారత్ ప్రతినిధి :** విజయనగరం జిల్లా కొత్తవలస మండలం లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖ విద్య వికాసం సాధికారత లో భాగంగా 14 సంవత్సరాలు నిండి చదవగలిగిన మరియు వ్రాయ గలిగిన పరిజ్ఞానం కలవారు అందరూ పదవ తరగతి పరీక్షకు అర్హులే పదవ తరగతి రెగ్యులర్గా చదివి ఫెయిల్ అయిన వారికి మరియు బడి మధ్యలో మానివేసి 14 సంవత్సరాల నిండిన వారికి పదవ తరగతి చదువుకునే సువర్ణ అవకాశం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కల్పిస్తోంది. 15 సంవత్సరాల నుండి పదవ తరగతి పూర్తయిన వారందరూ ఓపెన్ స్కూల్ ద్వారా ఇంటర్మీడియట్ కోర్స్ చదువుకునే అవకాశం కల్పిస్తోంది. ఇంటర్మీడియట్ మానివేసిన వారికి ఫెయిల్ అయిన వారికి ఇంటర్మీడియట్ చదువుకునే అవకాశం ఉంది. మహిళలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్లు మరియు మాజీ సైనికు ఉద్యోగులకు అడ్మిషన్ ఫీజు రాయితీ ఇవ్వబడుతుంది. అభ్యాసకులు ప్రవేశం పొందిన నాటి నుండి ఐదు సంవత్సరముల వరకు 9 పర్యాయాలు పబ్లిక్ పరీక్షలకు హాజరు కావచ్చు. ఏపీ ఆన్లైన్ ద్వారా గ్రామ, వార్డు, సచివాలయం ద్వారా ప్రవేశం పొందవచ్చు. మరియు అడ్మిషన్స్ లో భాగంగా ఈరోజు శనివారం సార్వత్రిక విద్య జిల్లా కన్వీనర్ టి. సన్యాసి రాజు బి.రామునాయుడు కార్యాలయ సిబ్బంది శివప్రకాష్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొత్తవలస కేంద్రం సందర్శించి ప్రధానోపాధ్యాయుల వారి అధ్యక్షతన ఎంఈఓ సమక్షంలో కొత్తవలస మండల కోఆర్డినేటర్ డాక్టర్ బి గోవింద నాయుడు ఆధ్వర్యంలో పోస్టర్ విడుదల చేయడం జరిగింది. ఈసందర్భంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, అధ్యాపకులు, ప్రిన్సిపాలు, సచివాలయ సిబ్బంది గ్రామ సర్పంచులు, ప్రజా ప్రతినిధులు,మహిళాసంఘాలు, స్వచ్ఛందసంస్థలు ప్రభుత్వ అధికారులు కలసి సంయుక్తంగా ఓపెన్ స్కూల్లోనే పదవ తరగతి మరియు ఇంటర్మీడియట్ కోర్సుల్లో విరివిగా చేర్పించి నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసినదిగా జిల్లా విద్యాశాఖ తరపున కోరుతున్నారు.

## బిజేపి యువమోర్చా ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్ ప్రోగ్రాం





**గుంటూరు, 25 జూలై 2026, భారత్ ప్రతినిధి :** భారతీయ జనతా యువమోర్చా గుంటూరు జిల్లా అధ్యక్షుడు తుంగ యశ్వంత్ మరియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాయతి ప్రదీప్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం పుల్లడిగుంట లోని ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో దేశం కోసం బలిదానమైన కార్గిల్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ కార్గిల్ విజయ్ దివస్ప్రోగ్రాం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ సైనికుల ప్రాణ త్యాగాల వల్లే మనం ప్రశాంతంగా బతకగలుగుతున్నామని దేశం కోసం ప్రాణత్యాగం చేసిన ప్రతిసైనికుడి విజయగాధను ప్రతిపౌరుడు తెలుసుకోవాలని కోరారు.

**వల్లూరి జయ ప్రకాష్ నారాయణ మాట్లాడుతూ** 1999 లో పాకిస్తాన్ సైని కులు అత్యంత క్రూరంగా భారతదేశం మీద దాడి చేస్తూ మన భూభాగాన్ని ఆక్రమించుకోవాలని దుర్బుద్ధి తో నిషిద్ధ ప్రాం తాల గుండా దేశంలోకి చొరబడితే భారత సైనికులు వీరోచి తంగా పోరాడి వారిని తరిమి వేయడం జరిగింది అని ఈ క్రమంలోని 500 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారని అలాంటి వీరుల త్యాగాలని మనం ఎప్పుడూ మరవకూడదు అని భవిష్యత్తులో కళాశాల విద్యార్థిని విద్యార్థులు కూడా దేశ సేవకి ముందుకు రావాలి అని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం ప్రధాన కార్యదర్శి ప్రసాద్, ఉపాధ్యక్షులు కొచ్చర్ల శ్రీ దుర్గా, బాలకోట య్య, కార్యదర్శి రాధాకృష్ణ, కార్యవర్గ సభ్యులు సురేంద్ర, మధు, పార్టీ ప్రధాన కార్యదర్శి బజరంగ్ రామకృష్ణ జిల్లా కార్యదర్శి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు

# రాజోలులో అన్నా క్యాంటీన్ నిర్వహణపై విమర్శలు

### ఒంటి గంటకే క్యాంటీన్ మూసివేత.. ఆకలితో వచ్చిన నిరుపేదలు వెనుదిరుగు




**రాజోలు బ్యూరో, 25 జూలై 2026, భారత్ ప్రతినిధి :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న అన్నా క్యాంటీన్ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రతి రోజూ లక్షలాది మంది నిరుపేదలకు కేవలం ?5కే పౌష్టికాహారం అందిస్తూ ఆకలి తీర్చుతున్నారు. అయితే, రాజోలు అన్నా క్యాంటీన్లో ఈ పథకం అమలుపై ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. శనివారం మధ్యాహ్నం ఒంటి గంటకే అన్నా క్యాంటీన్ మూసివేయడంతో, భోజనం కోసం ఆశగా వచ్చిన పలువురు నిరుపేదలు, కార్మికులు, అన్నార్తులు నిరాశతో వెనుదిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు భోజనాలు అందుబాటులో ఉండాల్సి ఉన్నప్పటికీ, నిర్ణీత సమయం ముగియకముందే క్యాంటీన్ మూసివేయడం పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నిర్వాహకుల అలసత్వం కారణంగానే ఈ పరిస్థితి నెలకొందని స్థానికులు ఆరోపిస్తున్నారు. పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఈ పథకం రాజోలులో సక్రమంగా అమలయ్యేలా సంబంధిత అధికారులు తక్షణచర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# పొగాకు రైతుల సమస్యకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం

### కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్



**గుంటూరు, 25 జూలై 2026, భారత్ ప్రతినిధి :** రాష్ట్రంలోని పొగాకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు తాత్కాలిక పరిష్కారాలు కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం సమన్వయంతో చర్యలు వేగవంతం చేశాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి నితిన్ కుమార్ యాదవ్, డైరెక్టర్ మౌనికా గౌర్తో కీలక సమావేశం జరిగింది. కేంద్ర కమ్యూనికేషన్స్ & గ్రామీణాభివృద్ధిశాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డీబీవీ స్వామి, వ్యవసాయ శాఖ, మార్క్‌ఫెడ్ అధికారులు, టుబాకో బోర్డు ప్రతినిధులు సమావేశంలో శనివారం పాల్గొన్నారు. పొగాకు రైతులను ఆదుకునేందుకు వడ్డీ లేని వర్కింగ్ క్యాపిటల్ రుణాలు, ప్రోత్సాహకాలు, ధర లోటు భర్తీ వంటి మూడు కీలక ప్రతిపాదనలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలోని పొగాకు రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ నష్టపోకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని విధాలుగా అండగా నిలుస్తాయని తెలియజేసారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు సమస్య పరిష్కారానికి కేంద్ర స్థాయిలో సమన్వయం చేస్తూ అన్ని వర్గాలతో చర్చలు కొనసాగిస్తున్నామని చెప్పారు. రైతులు,బయ్యర్లు,టుబాకో బోర్డు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందరూ కలిసి పనిచేస్తేనే సమస్యకు శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని బయ్యర్లు కూడా బాధ్యతాయుతంగా ముందుకు వచ్చి సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. మార్కెట్ పరిస్థితులు, అంతర్జాతీయ డిమాండ్, ధరల స్థిరీకరణ వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించి రైతులకు మేలు జరిగే విధంగా కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. పొగాకు పంటను అవసరమైతే నిల్వ ఉంచే అవకాశాలు, ధరలు మెరుగుపడిన తర్వాత మార్కెటింగ్ చేసే అవకాశాలపై కూడా చర్చలు జరుగుతున్నాయని వెల్లడించారు. తక్కువ, మధ్యస్థ, అధిక గ్రేడ్ పొగాకు విక్రయానికి సంబంధించి ట్రేడర్లతో ప్రత్యేకంగా చర్చించి కార్యాచరణ రూపొందిస్తున్నామని చెప్పారు. భవిష్యత్తులో ప్రతి ఏడాది ఇదే పరిస్థితి పునరావృతం కాకుండా షార్ట్ టర్మ్, మీడియం టర్మ్, లాంగ్ టర్మ్ వ్యూహాలతో సమగ్ర విధానాన్ని రూపొందించేందుకు కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం కలిసి పనిచేస్తాయని తెలిపారు.

**బయ్యర్లతో ప్రత్యేక సమావేశం:**
ముఖ్యమంత్రి సమావేశం అనంతరం కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులతో కలిసి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పలువురు ప్రముఖ పొగాకు బయ్యర్లతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. రైతులను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, టుబాకో బోర్డు ఇప్పటికే ముందుకు వచ్చాయని, రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని బయ్యర్లు కూడా సానుకూలంగా స్పందించాలని ఆయన కోరారు. రైతులకు మేలు చేసేలా ట్రేడర్ల నుంచి ఆచరణాత్మక ప్రతిపాదనలు తీసుకురావాలని సూచించారు. ఈ అంశంపై మరింత విస్తృతంగా చర్చించి తుది నిర్ణయానికి రావడానికి సోమవారం మరోసారి సమావేశం నిర్వహించాలని నిర్ణయించినట్లు డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలియజేశారు.

# కూటమి ప్రభుత్వం సంక్షేమ విజయాలను ప్రతి ఇంటికీ చేర్చాలి

### ఈ నెల 27 నుంచి నెల రోజుల పాటు డోర్ టు డోర్ ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
### శాసనసభ్యులు వనమాడి కొండబాబు





**కాకినాడ బ్యూరో, 25 జులై 2026, భారత్ ప్రతినిధి :** కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో అమలు చేసిన చారిత్రాత్మక సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, పారదర్శక పాలనను ప్రతి ఇంటికి చేరవేసే లక్ష్యంతో ఈ నెల 27వ తేదీ నుంచి నెల రోజుల పాటు నిర్వహించనున్న కూటమి ప్రభుత్వం సంక్షేమ విజయాలు" డోర్ టు డోర్ ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శాసనసభ్యులు వనమాడి కొండబాబు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు శనివారం నియోజకవర్గ స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు.

**ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ** ఈ నెల 27వ తేదీ నుంచి నెల రోజుల పాటు నిర్వహించనున్న కూటమి ప్రభుత్వం సంక్షేమ విజయాలు డోర్ టు డోర్ ప్రచార కార్యక్రమాన్ని ప్రతి కార్యకర్త ప్రజల ఇంటి వద్దకు వెళ్లి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను సవివరంగా వివరించాలని, అదే విధంగా ప్రజల అభిప్రాయాలు, సమస్యలు, అవసరాలను నేరుగా తెలుసుకొని వాటి పరిష్కారానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే వారధిగా ప్రతి కార్యకర్త బాధ్యతతో వ్యవహరించాలని, ప్రజలతో ఆత్మీయంగా మమేకమవుతూ ప్రభుత్వంపై వారి విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసే విధంగా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో రాష్ట్రంలో పారదర్శక, ప్రజాకేంద్రీకృత పాలన రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, వృద్ధులు, బీసీలు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాలను ప్రజలకు వివరించాలని అన్నారు. నియోజకవర్గ పరిశీలికలు పెచెట్టి చంద్రమౌళి మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, గ్రామీణ మౌలిక వసతుల కల్పన, ఉపాధి అవకాశాల పెంపు, పెట్టుబడుల ఆకర్షణ, సంక్షేమ పథకాల సమర్థ అమలు వంటి అంశాలతో పాటు, భవిష్యత్తులో చేపట్టబోయే అభివృద్ధి ప్రణాళికలను ప్రజలకు తెలియజేయాలని, ప్రజల ఆశయాలే ప్రభుత్వ లక్ష్యం ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం అనే భావనతో ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేసి ఈ ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం పేర్కొన్నారు. ఈ సమావేశంలో నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, గదుల సాయిబాబా, తుమ్మల రమేష్, బచ్చు శేఖర్, ఒమ్మి బాలాజీ, ఎస్.కె రహీం, చింతలపూడి రవి, చింతా పేర్రాజు, పంతాడి రాజు, తుమ్మల సునీత, మల్లిపూడి నాగదీవిక, ఏవిడి మెంటారావు, కోపనాతి నాగకుమారి, ఎండి ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

## సెల్‌ఫోన్ డ్రైవింగ్ మోడిఫైడ్ సైలెన్సర్లపై కాకినాడ ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక డ్రైవ్





**కాకినాడ బ్యూరో, 25 జూలై 2026, భారత్ ప్రతినిధి :** కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) డా. ఎం. కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో కాకినాడ బాలాజీ చెరువు సెంటర్‌లో సెల్‌ఫోన్ డ్రైవింగ్, మోడిఫైడ్ సైలెన్సర్ల వినియోగం పై కాకినాడ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారుల పై కేసులు నమోదు చేసి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ పోలీసులు వాహనదారులకు రోడ్డు భద్రత పై అవగాహన కల్పిస్తూ, వాహనం నడుపుతున్న సమయంలో సెల్‌ఫోన్ వినియోగించడం వల్ల ప్రమాదాల ముప్పు అధికంగా ఉంటుందని, అతివేగంగా వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు సంభవించే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. అలాగే మోడిఫైడ్ సైలెన్సర్లను ఉపయోగించడం వల్ల అధిక శబ్ద కాలుష్యం ఏర్పడటంతో పాటు ప్రజల ఆరోగ్యం పై ప్రతికూల ప్రభావం పడుతుందని, ట్రిపుల్ రైడింగ్, బైక్ స్టంట్స్, మైనర్ డ్రైవింగ్ వంటి నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడకుండా వాహనదారులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. రోడ్డు ప్రమాద బాధితులకు సకాలంలో సహాయం అందించే గుడ్ సమారిటన్లకు ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలు, రోడ్డు ప్రమాద బాధితులకు అందుబాటులో ఉన్న నగదు రహిత ఉచిత వైద్య చికిత్స వంటి అంశాలపై కూడా ప్రజలకు అవగాహన కల్పించారు. అదేవిధంగా ప్రమాదం జరిగిన ప్రదేశంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ట్రాఫిక్ నియమాలు, ట్రాఫిక్ సైన్ బోర్డుల ప్రాముఖ్యత, జీబ్రా క్రాసింగ్ లేని ప్రదేశాల్లో రహదారిని సురక్షితంగా దాటే విధానం పై అవగాహన కల్పించారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, నిబంధనలు ఉల్లంఘించే వారి పై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో ట్రాఫిక్-1 ఇన్‌స్పెక్టర్ ఎన్. రమేష్, ట్రాఫిక్ ఎస్ఐలు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

## రూ.557 కోట్లతో గుంటూరు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

### డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్



**గుంటూరు, 25 జూలై 2026, భారత్ ప్రతినిధి :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో గుంటూరు ప్రజల తాగునీటి సమస్యను తీర్చేందుకుగాను కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చొరవ తీసుకుని అమలు చేయిస్తున్న అమృత్ - 2.O &యుఐడిఎఫ్ పథకం ద్వారా రూ.577 కోట్లతో చేపడుతున్న త్రాగునీటి సరఫరా అభివృద్ధి పథక మౌలిక సదుపాయాలకు సంబంధిత ప్రజాప్రతినిధులతో కలిసి పెమ్మసాని గోరంట్లలో శనివారం శంకుస్థాపన చేశారు. అనంతరం పెమ్మసాని మాట్లాడుతూ, గుంటూ రు ప్రాంత ప్రజలకు తాగునీరు, రోడ్లు, డ్రైనేజీలు వంటి మౌలిక వసతులు కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. రాష్ట్ర విభజన సమయంలో గుంటూరు పరిసర ప్రాంతాల జనాభా సుమారు 8 లక్షలు ఉండగా, ప్రస్తుతం 11 లక్షలకు చేరుకుందని, రాబోయే 20 నుంచి 30 సంవత్సరాల్లో ఈ సంఖ్య 20 లక్షలకు పెరిగే అవకాశం ఉందని తెలిపారు. గతంలో అందుబాటులో ఉన్న నీటి సరఫరా ప్రస్తుత అవసరాలకు సరిపోని పరిస్థితి ఏర్పడిందని, భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఈ సమగ్ర ప్రాజెక్టును రూపొందించామని చెప్పారు. రూ.557 కోట్లకు పైగా నిధులతో ప్రాజెక్టులో కొత్త నీటి వనరులు, కొత్త రిజర్వాయర్లు, ఆధునిక పంపింగ్ వ్యవస్థ, నగరమంతా విస్తరించే పంపిణీ పైప్‌లైన్ నెట్‌వర్క్ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. అమరావతి సమీపంలోని కృష్ణా నది నుంచి కొత్త పైప్‌లైన్ ద్వారా నీటిని తీసుకువచ్చి శుద్ధి చేసి గోరంట్ల రిజర్వాయర్‌కు పంపించి, అక్కడి నుంచి గ్రావిటీ విధానంలో గుంటూరు నగరం, పరిసర ప్రాంతాలకు సరఫరా చేసే విధంగా ప్రాజెక్టును రూపొందించామని తెలిపారు. ప్రస్తుతం అవసరాలకు అనుగుణంగా 85 ఎంఎల్‌డి సామర్థ్యంతో వ్యవస్థ ను నిర్మిస్తున్నప్పటికీ, భవిష్యత్‌లో 200 ఎంఎల్‌డి వరకు నీటిని సరఫరా చేసే సామర్థ్యం కలిగిన పైప్ లైన్లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. తక్కెళ్లపాడులో అదనంగా 50 ఎం ఎల్ డి సామర్థ్యంతో మరో రిజర్వాయర్ నిర్మించి విలీన గ్రామాల తాగునీటి అవసరాలను కూడా తీర్చనున్నట్లు వెల్లడించారు. ఈ ప్రాజెక్టు పూర్తయిన తర్వాత గుంటూరు నగరానికి 'వాటర్ రింగ్ రోడ్' తరహాలో సమగ్ర నీటి పంపిణీ వ్యవస్థ ఏర్పడి, విలీన గ్రామాలతో పాటు భవిష్యత్‌లో అభివృద్ధి చెందే ప్రాంతాలకు కూడా తాగునీటి కొరత లేకుండా ఉంటుందని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు క్లిష్టంగా ఉన్నప్పటికీ, ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవతో బ్యాంకుల సహకారంతో ఈ ప్రాజెక్టును ప్రారంభించగలిగామని పేర్కొన్నారు. గతంలో ఆమోదం పొందిన పనులు ఐదేళ్లపాటు ముందుకు సాగకపోవడంతో గుంటూరు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఇప్పుడు ఆ పరిస్థితిని మార్చేందుకు వేగంగా చర్యలు చేపట్టిందన్నారు. ప్రజల జీవితాలను మార్చేది కేవలం నగదు పథకాలు మాత్రమే కాదని, స్వచ్ఛమైన తాగునీరు, నాణ్యమైన రహదారులు, మెరుగైన డ్రైనేజీ వ్యవస్థ, ఆరోగ్యకరమైన వాతావరణం వంటి శాశ్వత మౌలిక వసతులే నిజమైన అభివృద్ధికి నిదర్శనమని పెమ్మసాని పేర్కొన్నారు.

# రియల్ ఎస్టేట్ రంగంపై గోబెల్స్ ప్రచారం నమ్మొద్దు

**రెండున్నర ఏళ్లలో**
**దాదాపు 40 శాతం రియల్ వృద్ధి**

**త్వరలో మూసీ సుందరీకరణకు టెండర్లు**

**రియల్ ఎస్టేట్‌తో పాటు పేదల ఇళ్ల నిర్మాణానికి ప్రాధాన్యత**

**రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ , సమాచార శాఖ మంత్రి పొంగులేటి**




**హైదరాబాద్,జులై 25:** రాష్ట్రంలో ముఖ్యంగా హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందని కొంతమంది ఉద్దేశపూర్వకంగా గోబెల్స్ ప్రచారం సాగిస్తున్నారని దీనిలో ఏమాత్రం నిజం లేదని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ , సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయంలో స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ శాఖ మంత్రిగా స్పష్టమైన ఆధారాలు, వివరాలు ఉన్నాయని అందువలన అటువంటి ప్రచారాలను నమ్మాల్సిన అవసరం లేదని అన్నారు. శనివారం నాడు నగరంలో జరిగిన ఒక కార్యక్రమంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ గత రెండున్నర సంవత్సరాల ప్రజా ప్రభుత్వ పాలనలో సుమారు 15 నుంచి 20 శాతం రియల్ ఎస్టేట్ అభివృద్ధి జరిగిందని , 40 శాతం వరకు ఎ÷-లాట్ల విక్రయాలు వృద్ధిచెందాయని అన్నారు. గడచిన పదేళ్లతో పోలిస్తే ఈ రెండున్నర ఏళ్లలో రెసిడెన్షియల్ మార్కెట్ విశేషంగా పెరిగిందని, దీనికి సంబంధించి తమ స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ శాఖలో పెరిగిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల సంఖ్యనే నిదర్శనమన్నారు. రియల్ ఎస్టేట్ పడిపోయిందని కొంతమంది పనిగట్టుకొని ఈ ప్రభుత్వంపై బురద చల్లేందుకు ఈ గోబెల్స్ ప్రచారం సాగిస్తున్నారని వాటిని పట్టించుకోవద్దని మంత్రి అన్నారు. 2004 నుంచి 2014 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో నాటి కాంగ్రెస్ ముఖ్యమంత్రుల చొరవ కారణంగానే హైదరాబాద్ ఒక రోల్ మోడల్‌గా రూపొందిందని, వారి దూరదృష్టి వల్లే ఓఆర్ఆర్, అంతర్జాతీయ విమానాశ్రయం, ఐటి సెక్టార్ తదితరాలు 360 డిగ్రీల కోణంలో అభివృద్ధి చెందాయని వివరించారు. అందువల్లే హైదరాబాద్ ఇప్పుడు దేశంలోనే గాక ప్రపంచంలోనే అందరి దృష్టిని ఆకర్షిస్తోందని, ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారితో కలసి దావోస్ వెళ్లినపుడు అక్కడ కూడా అధికశాతం పారిశ్రామిక వేత్తలు హైదరాబాద్ లో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నారన్నారు. హైదరాబాద్ నగరం పెట్టుబడులకు గమ్యస్థానం అవుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి దూరదృష్టితో ప్రణాళికాబద్ధంగా హైదరాబాద్ నగరాభివృద్ధికి చర్యలు చేపట్టారు. 7వేల కోట్లతో చేపడుతున్న మూసీ ప్రాజెక్ట్ సుందరీకరణ పట్టాలెక్కనుందని మంత్రి పొంగులేటి తెలిపారు. 28 కిలోమీటర్ల తొలి విడత అభివృద్ధికి వారం పది రోజుల్లో టెండర్లు పిలవబోతున్నామని చెప్పారు. అదేవిధంగా పాత బస్తీ తదితరాలను కలుపుతూ రెండవ విడతగా 76 కిలోమీటర్ల మేర 24వేల కోట్లరూపాయిల ఖర్చుతో మెట్రో విస్తరణ కార్యక్రమం ప్రారంభం కానుందని తెలిపారు. ఇవేగాక ట్రిబుల్ ఆర్ నుంచి ఓఆర్ఆర్ కలుపుతూ రేడియల్ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయని తెలిపారు. ప్రపంచంలోనే సుందరనగరమైన హైదరాబాద్ ను రియల్ ఎస్టేట్ రంగం పక్షాన కూడా మరింత అభివృద్ధి చెందడానికి రియల్ ఎస్టేట్ రంగ ప్రతినిధులు సహకారం అవసరమని, ప్రజలకు నమ్మకంగా, సకాలంలో ఎ÷-లాట్లను అందించి వారి అభిమానాన్ని చూరగొనాలని మంత్రి హితవు పలికారు. రాష్ట్రంలో భూముల భద్రత , భరోసా కల్పించేందుకు భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామని , వీటిలో కొన్ని చిన్న చిన్నసమస్యలను సాఫ్ట్ వేర్ పరంగా 15-20 రోజుల్లో సరిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. కేవలం రియల్ ఎస్టేట్ రంగం కోసమే గాకుండా పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు క్యూర్ పరిధిలో తొలివిడతగా

లక్ష ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు నిర్ణయించామని, దీని తర్వాత దఫదఫాలు ఇళ్ల మంజూరు ఉంటుందని మంత్రి చెప్పారు. ప్రజలకు ఇళ్ల నిర్మాణానికి 2-3 లక్షల చదరపు అడుగుల స్థల సేకరణకు ప్రయత్నిస్తున్నామని చెబుతూ రియల్ ఎస్టేట్ రంగ ప్రతినిధుల కోరిక మేరకు ఫాస్ట్ ట్రాక్ సౌకర్యాన్ని కల్పించేందుకు ప్రయత్నిస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రఘురామ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ టవర్స్ కోసం హెల్ప్‌లైన్

**ప్రజలకు అందుబాటులోకి తెచ్చిన ప్రభుత్వం**

**ప్రారంభించిన మంత్రి పొంగులేటి**

**హైదరాబాద్,జులై 25 :** క్యూర్ పరిధిలో నిర్మిస్తున్న ఇందిరమ్మ టవర్స్ గృహాల కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక హెల్ప్‌లైన్‌ను ప్రారంభించింది. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి 040-24603572 హెల్ప్‌లైన్‌ను ప్రారంభించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ కాల్ సెంటర్ సేవలు అందుబాటులో ఉంటాయని మంత్రి తెలిపారు. తెలుగు, హిందీ, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో దరఖాస్తుదారులకు సమాచారం అందించనున్నారు. దరఖాస్తు పక్రియను సులభతరం చేస్తూ, ఆధార్ కార్డు ఒక్కటే సరిపోతుందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. దరఖాస్తు సమయంలో ఇతర పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదని తెలిపారు. అయితే, రూ.10 వేల ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ ను యూపీఐ లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారా మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఒకవేళ ప్లాట్ కేటాయించకపోతే అదే బ్యాంకు ఖాతాకు ఈ మొత్తం తిరిగి జమ చేయనున్నట్లు వెల్లడించారు. క్యూర్ పరిధిలో కనీసం 10 సంవత్సరాలు నివాసం ఉండాలని మంత్రి తెలిపారు. కుటుంబ వార్షిక ఆదాయం రూ.6 లక్షల లోపు ఉండాలన్నారు. ఒక కుటుంబం నుంచి ఒకే దరఖాస్తు మాత్రమే స్వీకరిస్తారని పేర్కొన్నారు. అలాగే క్యూర్ లేదా ఔటర్ రింగ్ రోడ్ పరిధిలో ఇప్పటికే సొంత ఇల్లు లేదా స్థలం ఉన్నవారు ఈ పథకానికి అర్హులు కాదని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. అర్హుల సంఖ్య అందుబాటులో ఉన్న ప్లాట్ల కంటే ఎక్కువగా ఉంటే లాటరీ విధానంలో కేటాయింపులు చేపడతారని తెలిపారు. ఇందిరమ్మ టవర్స్‌లో ప్లాట్ ధర రూ.40 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు ఉండగా, ప్రభుత్వం రూ.5 లక్షల సబ్సిడీ అందిస్తుందని స్పష్టం చేశారు. మిగిలిన మొత్తంలో లబ్ధిదారుడు తన వాటాగా రూ.6 లక్షలు చెల్లించాల్సి ఉంటుందని మంత్రి పొంగులేటి తెలిపారు.

# అబద్ధాలతో ఆగమాగం అవుతున్న కడియం

**ఆనాడు కాళేశ్వరాన్ని పొగిడి.. ఇప్పుడు విమర్శలా**

**దేవాదులకు అసలు వినాశకర్తవు నీవే**

**మండిపడ్డ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య**

**జనగామ,జులై 25:** ఆనాడు కాళేశ్వరం ప్రాజెక్టును ఇంజనీరింగ్ అద్భుతం, వరప్రదాయని, మానస పుత్రిక అని పొగిడిన కడియం శ్రీహరి, నేడు మాటమార్చి కాళేశ్వరం కాదని కూలేశ్వరం అనడం ఆయన నైజానికి నిదర్శనమని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య విమర్శించారు. దేవాదులకు కడియం సృష్టికర్త కాదని, వినాశక కర్త అని ధ్వజమెత్తారు. స్టేషన్ ఘనపూర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గత వారం రోజులుగా నియోజకవర్గంలో తిరుగుతూ కడియం శ్రీహరి అబద్ధాలు మాట్లాడుతూ ఆగమాగం అవుతున్నారని ఎద్దేవా చేశారు. ఆయన మాటలన్నీ చిన్నపిల్లల చిలిపి చేష్టలు, కారుకూతల్లాగే ఉన్నాయని మండిపడ్డారు. తెలంగాణను ఎండబెడుతూ ఆంధ్రప్రదేశ్ కి నీటిని దోచిపెట్టేలా రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కాళేశ్వరం అంటే కేవలం మేడిగడ్డ మాత్రమే కాదని, 16 రిజర్వాయర్లకు నీరందించే కల్పతరువు అని స్పష్టం చేశారు. కేసీఆర్‌కు చెడ్డపేరు తేవడానికే కాళేశ్వరంపై రేవంత్ రెడ్డి కుట్రలు చేస్తున్నారని, ఇప్పుడు కేంద్రానికి లేఖలు రాయడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డికి ప్రాజెక్టులపైనా, రైతుల సమస్యలపైనా కనీస అవగాహన లేదని రాజయ్య దుయ్యబట్టారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి పాలన వల్ల కరువు వస్తే, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో కడియం శ్రీహరి వల్ల కరువు వచ్చిందని వ్యాఖ్యానించారు. నకిలీ కాంగ్రెస్‌లోకి వెళ్లిన కడియం శ్రీహరి, ఎమ్మెల్యేగా ఉండి కూడా పంటలకు నీళ్లు ఇవ్వలేకపోతున్నానని చెప్పడం సిగ్గుచేటని అన్నారు. కడియం కేవలం కమిషన్లు వచ్చే పనులపైనే దృష్టి పెడతారని, కమిషన్లకు కక్కుర్తి పడి ప్రాజెక్టుల అంచనాలు పెంచిన చరిత్ర ఆయనదని తీవ్ర ఆరోపణలు చేశారు. నియోజకవర్గానికి ఎవరు ఎంత చేశారనే దానిపై బహిరంగ చర్చకు రావలసిందిగా కడియం శ్రీహరికి రాజయ్య సవాల్ విసిరారు. నేను చేసిన అభివృద్ధి పనులపై, నువ్వు చేసిన పనులపై చర్చకు సిద్ధం.. స్టేషన్ ఘనపూర్ అంబేద్కర్ విగ్రహం వద్దకు రావాలని సవాల్ చేశారు. అలాగే అసలు సిసలైన కాంగ్రెస్ నాయకులకు పదవులు రాకుండా కడియం అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. ఎక్కువ మాట్లాడకుండా కుక్కిన పేనులాగా ఉండు బిడ్డా అంటూ కడియం శ్రీహరికి పరోక్షంగా హెచ్చరికలు జారీ చేశారు.

# నా దీక్షనే అనుమానిస్తారా...?

**కేంద్రంతో లాలూచీ పడతాననుకున్నారా.. విమర్శలపై సోనమ్ వాంగ్‌చుక్ ఘాటు స్పందన**



**న్యూఢిల్లీ,జూలై25:** దాదాపు 26 రోజుల పాటు నిరాహార దీక్ష చేసిన సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ ఇటీవల కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ సమక్షంలో దీక్షను విరమించారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్ నెరవేరకపోయినా తాను ఎందుకు నిరాహార దీక్ష విరమించాల్సి వచ్చిందో తాజాగా సోనమ్ వివరించారు. ప్రభుత్వంతో ఎలాంటి రహస్య ఒప్పందమూ చేసుకోలేదని, నిరసనకారుల భద్రత కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఢిల్లీలో నిరసన తెలుపుతున్న విద్యార్థులు, యువతపై హింసాత్మక చర్యలు జరిగే అవకాశం ఉందన్న ఆందోళన తనకు కలిగిందని వాంగ్‌చుక్ పేర్కొన్నారు. గతంలో లడఖ్‌లో జరిగిన పోలీసు చర్యల మాదిరిగా పరిస్థితి మారకూడదనే ఉద్దేశంతో ఉపవాసాన్ని ముగించాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. అలాగే, కేంద్ర ప్రభుత్వం నుంచి కొన్ని అంశాలపై లిఖితపూర్వక హామీ లభించిందని ఆయన తెలిపారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేసిన వారిపై ప్రతీకార చర్యలు ఉండవని, వారి సమస్యలపై చర్చ కొనసాగుతుందని ప్రభుత్వం హామీ ఇచ్చిందని వాంగ్‌చుక్ పేర్కొన్నారు (ఔఇఇ÷ు ÷ఔసనీబిၤబబి). అయితే, దీక్ష విరమించడం అంటే ఉద్యమం ముగిసినట్లు కాదని స్పష్టం చేశారు. కాగా, జంతర్ మంతర్‌లో నిరసన చేపడుతున్న సీజేపీ నేతలు మాత్రం తమ ఆందోళన కొనసాగుతుందని ప్రకటించారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు ఉద్యమం ఆగదని వారు వెల్లడించారు. పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ 26 రోజులు చేసిన నిరాహార దీక్షను కేంద్రమంత్రుల సమక్షంలో విరమించిన నేపథ్యంలో.. డీల్ కుదిరిందంటూ ఆయనపై పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. వీటిని ఆయన తీవ్రంగా ఖండించారు. 'నేను చేసిన దీక్ష ఎంత స్వచ్ఛమైందో నిరూపించుకునేందుకు సర్టిఫికెట్ కావాలా.. అని ప్రశ్నించారు. ఈ మేరకు సోషల్ మీడియాలో వీడియో విడుదల చేశారు. అలాగే విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయకుండానే దీక్ష విరమించడంపైనా స్పందించారు. దీక్ష విరమించినప్పటి నుంచి చాలా మంది నాకు ఫోన్ చేస్తున్నారు. సోషల్ మీడియాలో పోస్టులు చూపిస్తూ.. మీపై పలు సందేహాలు వస్తున్నాయని చెప్తున్నారు. కేంద్రమంత్రుల సమక్షంలోనే ఎందుకు దీక్ష విరమించారు..? ఏం ఒప్పందం జరిగింది..? అని అడుగుతున్నారు. నేను నిరాహార దీక్ష ఎంత పవిత్రంగా చేశానో ఎవరి నుంచైనా సర్టిఫికెట్ తీసుకోవాలా..? ఇలా బేరాలు కుదుర్చుకోవాల్సి వస్తే.. ఎవరైనా 26 రోజులు ఆకలితో ఉంటారా..? దిల్లీ ఎండలో రోడ్డు పక్కన కూర్చునే బదులు.. ఏసీ గదిలో కూర్చొని డీల్ చేసుకోలేనా' అని తనపై వస్తోన్న విమర్శలకు వాంగ్‌చుక్ కౌంటర్ ఇచ్చారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనేది కచ్చితంగా ముఖ్యమైన విషయం. అయితే నిరసనకారులపై ఎలాంటి చట్టపరమైన చర్యలు తీసుకోకుండా నిరోధించడమే నాకు ప్రాధాన్య అంశంగా అనిపించింది. అందుకే కేంద్రంతో చర్చల సమయంలో రాజీనామా గురించి నేను డిమాండ్ చేయలేదు. రాజీనామాను వ్యక్తిగతంగా ప్రస్తావించాల్సిన అవసరం ఉందని అనుకోవడం లేదు. దీన్ని కేంద్రం పెద్ద విషయంగా భావించడం లేదు. రాజీనామా అంశాన్ని నిరాకరించడం వల్ల అపారనష్టాన్ని చవిచూస్తోంది. దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠ దిగజారుతోంది. ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. రాజీనామా విషయంలో ఎటూ తేల్చకుండా కేంద్రం ఎక్కువ కాలం నాన్చలేదు. కొన్నిరోజుల్లో మంత్రి రాజీనామా సమర్పిస్తారని నాకు తెలుసు. అందుకే ఆ విషయంలో నేను మరీ ఎక్కువ ఒత్తిడి చేయలేదు' అని వాంగ్‌చుక్ వివరించారు. దీక్ష కొనసాగిస్తున్న సమయంలో.. దిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు సోనమ్ వాంగ్‌చుక్‌ను జంతర్‌మంతర్ నుంచి సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి పరిస్థితులపై తాజాగా వాంగ్‌చుక్ స్పందించారు. ఆ ఆసుపత్రి జైలులా అనిపించింది. ఒక ఖైదీ కంటే తీవ్రంగా పరిగణించారు. చుట్టూ ఆంక్షలే. నేను నా గది నుంచి కూడా రాలేకపోయా. ఎవరిని కలవడానికి అనుమతించలేదు. ముగ్గురు బంధువులను మాత్రం నావద్దకు రానిచ్చారు అంటూ వీడియో సందేశంలో పేర్కొన్నారు. ఆయన భార్య గీతాంజలి దిల్లీ హైకోర్టులో పిటిషన్ వేయడంతో.. అక్కడి నుంచి మేదాంత ఆసుపత్రికి తరలించిన విషయం తెలిసిందే.

# ప్రజాశక్తే ఎల్లప్పుడూ గొప్పది

**వారి ముందు ఏ అధికారమూ నిలబడలేదు**

**దేశ యువత, జెన్ జీని ప్రశంసిస్తూ కేటీఆర్ ట్వీట్**

**హైదరాబాద్,జులై 25 :** యావత్ దేశాన్ని కుదిపేసిన నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై సీజేపీ కాంక్రోచ్ జనతా పార్టీతోపాటు విద్యార్థుల ఆందోళనలు చేపట్టిన నేపథ్యంలో వారి డిమాండ్ల మేరకు ధర్మేంద్ర ప్రధాన్ తన కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. తమ మూడు డిమాండ్లు నెరవేరడంతో ఆందోళన విరమిస్తున్నట్టు సీజేపీ ప్రకటించింది. ఈ మేరకు కేంద్రం సీజేపీ నేతలను చర్చలకు కూడా ఆహ్వానించింది. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. అధికారంలో ఉన్నవారి కంటే ప్రజల శక్తి ఎప్పుడూ గొప్పది. జెన్ జి ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేశారు. ఢిల్లీలో విద్యార్థులు, యువతపై కేంద్ర ప్రభుత్వం చేసిన దాష్టీకానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద శుక్రవారం నిర్వహించిన భారీ నిరసన కార్యక్రమానికి మహానగరంతో పాటు రాష్ట్ర నలుమూలల నుంచి వేలాది మంది యువతీ యువకులు దండుకట్టి తరలివచ్చారని తెలిసిందే. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరై భావోద్వేగంతో ప్రసంగించారు. 'పరీక్ష పే చర్చ పెట్టిన మీరు పేపర్ లీకేజీలపై ఎందుకు పెట్టలేదు? ఏటా 2 కోట్ల ఉద్యోగాల హామీ ఏమైంది?' అని కేంద్రాన్ని నిలదీశారు. ఢిల్లీలో పిల్లలపై దాడులను చూస్తుంటే ఇద్దరు పిల్లల తండ్రినైన తన మనస్సు చలించిపోతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. మోదీ, రేవంత్ ప్రభుత్వాలపై తనదైన శైలిలో పంచులు విసిరారు. ఢిల్లీలో యువతపై మోదీ సర్కార్ సాగిస్తున్న దమనకాండను కండ్లకుకట్టారు. రేవంత్ దాగుడు మూతలను ఎత్తిచూపారు. ఢిల్లీ వీధుల్లో న్యాయం కోసం పోరాడుతున్న యువకులపై ఉగ్రవాదులు, దేశద్రోహులు, పాకిస్థాన్ నుంచి నిధులు వస్తున్నాయని అడ్డగోలుగా మాట్లాడుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. నిజంగానే కేంద్రానికి బాధ్యత ఉంటే ఉద్యమిస్తున్న విద్యార్థుల వద్దకెళ్లి చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాల్సి ఉండేదన్నారు.

# దేశంలో మార్పు మొదలైంది

**బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు**

**హైదరాబాద్, జూలై 25:** 'దేశవ్యాప్తంగా సమాజంలో ఒక సరికొత్త వైఖరి, మార్పు ప్రారంభమైంది. అది ఇప్పుడు ప్రత్యక్షంగా కనిపిస్తున్నది' అని బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా నేపథ్యంలో ఎక్స్ వేదికగా శనివారం ఆయన పెట్టిన ఆసక్తికర పోస్ట్ రాజకీయ వర్గాల్లోనూ, సామాజిక మాధ్యమాల్లోనూ చర్చనీయాంశంగా మారింది. దేశ భవిష్యత్తును నిర్దేశించేది యువశక్తేనని, వారు అనుకొన్నది సాధించి తీరుతారనడానికి ఈ విజయమే నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు పోరాడిన యువతకు, ఇతర వర్గాలకు హృదయపూర్వక అభినందనలు అని పేర్కొన్నారు. హరీశ్‌రావు పోస్టు క్షణాల్లోనే వైరల్ అయింది. యువత, ఆయన మద్దతుదారులు ఈ ట్వీట్‌ను రీట్వీట్ చేస్తూ తమ మద్దతు ప్రకటించారు. సమాజంలో సరికొత్త ఆలోచనలు, యువశక్తికి ప్రాధాన్యం పెరగడానికి ఈ రకమైన సానుకూల ధోరణి ఎంతగానో తోడ్పడుతుందని నెటిజన్లు తమ కామెంట్లతో అభిప్రాయాలు వ్యక్తంచేశారు.

# పదవులు తాత్కాలికం, ప్రజల విశ్వాసమే అంతిమం: బండి

**హైదరాబాద్,జులై 25 :** 'పదవులు తాత్కాలికం, ప్రజల విశ్వాసమే అంతిమం' అని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. ప్రజల ఆకాంక్షల మేరకు నడవడమే ప్రజాస్వామ్యమని చెప్పారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై ఆయన స్పందించారు. తమకు పార్టీ కంటే.. దేశమే ప్రధానమన్నారు. ' ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రజాస్వామ్యం అంటే.. ప్రజల గొంతు వినడం, వారి మాటను గౌరవించడం, అవసరమైతే బాధ్యత తీసుకునే ధైర్యాన్ని కలిగి ఉండటం. భాజపా దాన్నే పాటిస్తుంది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా పార్టీ విలువలను ప్రతిబింబిస్తుంది. ఇన్నేళ్లపాటు దేశసేవలో భాగమైనందుకు ధర్మేంద్ర ప్రధాన్‌కు ధన్యవాదాలు' అని ఎక్స్‌లో పోస్టు చేశారు.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా దేశ యువశక్తి విజయం

**బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి**

**నిజామాబాద్,జూలై25 :** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా దేశ యువత మొక్కవోని పోరాట పటిమతో సాధించిన ప్రజాస్వామ్య విజయమని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువత రాజకీయాలకు అతీతంగా తమ భవిష్యత్తు కోసం, విద్యా వ్యవస్థలో పారదర్శకత కోసం చేపట్టిన ఉద్యమం చివరకు ఫలితాన్ని ఇచ్చిందన్నారు. పరీక్షల నిర్వహణలో జరిగిన అవకతవకలు, విద్యార్థుల భవిష్యత్తుపై నెలకొన్న అనిశ్చితికి వ్యతిరేకంగా యువత శాంతియుతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా చేసిన పోరాటానికి కేంద్ర ప్రభుత్వం చివరకు స్పందించి దిగిరాక తప్పలేదన్నారు. ఉద్యమాన్ని అణచివేసేందుకు ప్రభుత్వం లాఠీచార్జీలు, భాష్పవాయు గోళాలు, నిర్బంధాలను ఆశ్రయించినప్పటికీ, దేశ యువత ఏమాత్రం వెనక్కి తగ్గకుండా అపారమైన ధైర్యంతో తమ ఉద్యమాన్ని కొనసాగించిందన్నారు. 'అధికారం ఎంత బలంగా కనిపించినా, చైతన్య వంతమైన యువత సంకల్పం ముందు తలవంచక తప్పదనే విషయాన్ని ఈ ఉద్యమం మరోసారి నిరూపించింది' అని అన్నారు. యువత ఐక్యపోరాటం ముందు ప్రభుత్వం దిగివచ్చే పరిస్థితి ఏర్పడిందని, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ఆ ప్రజాస్వామ్య పోరాటానికి లభించిన నైతిక విజయమని పేర్కొన్నారు. కానొక సందర్భం లో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నట్టు ?'దేశం కోసం అవసరం వచ్చినప్పుడు ఇండియా రియాక్ట్ అవుతుంది'? అనే మాటలను ఎమ్మెల్యే గుర్తు చేశారు. నేడు దేశ యువత అదే విషయాన్ని మరోసారి సాక్షాత్కరించిందన్నారు. 'యువత ప్రశ్నించడం ప్రారంభిస్తే అధికార వ్యవస్థలు జవాబుదారీతనం వహించక తప్పదు. ప్రజాస్వామ్యంలో ప్రజల గొంతుకే అంతిమ తీర్పు' అని అన్నారు. చదువుకున్న యువత కేవలం ఉద్యోగాల కోసం మాత్రమే కాదు... దేశ భవిష్యత్తు కోసం కూడా పోరాడుతుందని ఈ ఉద్యమం స్పష్టం చేసింది. జ్ఞానం, చైతన్యం, ఐక్యత కలిసొస్తే ఏ అహంకారమైనా కూలిపోవాల్సిందే' అని వేముల ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖ వైఫల్యం స్పష్టం

**మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి వ్యాఖ్య**

**నాగర్ కర్నూల్,జులై 25:** నీట్ ప్రశ్నా పత్రాల లీకేజి విషయంలో కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖ వైఫల్యం స్పష్టంగా ఉందని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి అన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, యువకులు, విద్యావేత్తలు ఎంతగా కోరినా కేంద్రం పెడచెవిన పెట్టడం వల్ల పరిస్థితి చేయి దాటిందని పేర్కొన్నారు. వాంగ్ చుక్ దీక్ష విషయంలో, కాక్రోచ్ జనతాపార్టీ ఆందోళన విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరించిన వైఖరి ఏమాత్రం సమంజసంగా లేదని వెల్లడించారు. విద్యార్థుల మీద అమానుషంగా ప్రవర్తించడం ప్రతీ భారతీయుడ్ని కదిలించిందని వివరించారు. ప్రజాగ్రహాన్ని గ్రహించే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చిందని తెలిపారు. అనేక మంది రైతులు మరణించిన తర్వాత సాగు చట్టాలను రద్దు చేసినట్లే, అనేక మంది విద్యార్థులు నష్టపోయిన తర్వాత ధర్మేంద్రతో రాజీనామా చేయించడం మోదీ చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లయిందని విమర్శించారు.

నీట్ లాంటి జాతీయ పరీక్షల విషయంలో కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా మరింత బాధ్యతగా వ్యవహరిస్తుందని ఆశిస్తున్నానని పేర్కొన్నారు. అనేక విషయాల్లో వైఫల్యం చెందిన రాష్ట్ర ప్రభుత్వం కూడా తాజా రాజకీయ పరిణామాలతో అప్రమత్తం కావాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

6

## ధర్మేంద్ర రాజీనామాపై వాంగ్‌చుక్ హర్షం

**న్యూఢిల్లీ :** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ హర్షం వ్యక్తం చేశారు. ఇది పట్టుదలతో యువత సాధించిన విజయని పేర్కొన్నారు. జెన్-జీ, సీజేపీ ప్రతినిధులకు అభినందనలు తెలియజేశారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో శనివారం ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. ఇది ప్రజాస్వామ్యం సాధించిన విజయం. ఇది శాంతి, ఓర్పు, నిరంతర పట్టుదలల విజయం. దేశంలోని సీజేపీ, జెన్ జీ యువతకు అభినందనలు. భయాన్ని వీడి దేశం నలుమూలల నుంచి పోరాటానికి కదలివచ్చిన పౌరులందరికీ ధన్యవాదాలు. ఇప్పటివరకు బాధ్యతాయుతమైన సమాధానం కోరాం. ఇకపై సంస్కరణల వైపు సాగుదాం' అని రాసుకొచ్చారు.

## ఎన్‌డిఎలో ఇద్దరు రాజీనామా

### గతంలోనే వైదొలగిన ఎంజె అక్బర్

**న్యూఢిల్లీ :** నీట్ పేపర్ లీకేజీపై కాక్రోచ్ జనతా పార్టీ, విద్యార్థిలోకం నిరసనల ధాటికి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. జంతర్ మంతర్ కేంద్రంగా దాదాపు నెల రోజుల పాటు అలుపెరగని పోరాటానికి.. యువతరం మొండిపట్టుదలకు ఎట్టకేలకు దిగొచ్చిన ప్రధాన్ శనివారం రిజైన్ చేశారు. గత ఎనిమిదేళ్లలో ఇలా పదవీకాలం మధ్యలోనే వైదొలిగిన ఏకైక కేంద్ర మంత్రి ప్రధానే కావడం విశేషం. 2018లో విదేశాంగ శాఖ సహాయ మంత్రి ఎంజే అక్బర్ అనూహ్యంగా రాజీనామా సమర్పించారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో విద్యార్థిలోకం శాంతించింది. నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ ప్రధాన్ స్వచ్ఛందంగా వైదొలగడంతో కాక్రోచ్ జనతా పార్టీ నేతలు ఉద్యమాన్ని విరమించారు. అయితే.. గత ఎనిమిదేళ్లలో కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసిన ఏకైక వ్యక్తి ధర్మేంద్ర ప్రధాన్. అయన కంటే ముందు.. 2018లో అనూహ్య పరిణామాల మధ్య ఎంజే అక్బర్ విదేశాంగ శాఖ సహాయ మంత్రి బాధ్యతల నుంచి వైదొలిగారు. నరేంద్ర మోడీ క్యాబినెట్‌లో మంత్రిగా 2016లో బాధ్యతలు చేపట్టిన అక్బర్.. అంతకుముందు వార్త పత్రిక ఎడిటర్‌గా ఉన్న సమయంలో పలు మహిళలపై లైంగిక వేధింపులు పాల్పడ్డాడనే ఆరోపణలు వచ్చాయి. ఆయనకు వ్యతిరేకంగా మీటూ ఉద్యమం తీవ్రమవ్వడంతో అక్బర్ రాజీనామా చేయాల్సి వచ్చింది. ఈసారి నీట్ ప్రశ్నాపత్రం లీకేజీపై విద్యార్థులు భగ్గుమనడంతో.. ప్రధాన్ రాజీనామా అనివార్యమైంది. అయితే.. 2017లో రాజ్‌నాథ్ సింగ్ మీడియాతో మాట్లాడుతూ మాది యూపీఏ ప్రభుత్వం కాదు మంత్రులు రాజీనామా చేయడానికి అని నవ్వుతూ జవాబిచ్చాడు. కట్ చేస్తే తొమ్మిదేళ్లకు ఎన్డేఏ మంత్రివర్గంలోని ధర్మేంద్ర ప్రధాన్ అనూహ్య పరిణామాలతో వైదొలగాల్సి వచ్చింది.

## గుజరాత్‌లో వరదల బీభత్సం

### వల్సాద్‌లో నీట మునిగిన గృహసముదాయాలు

**గాంధీనగర్ :** గుజరాత్‌లోని వల్సాద్‌లో భారీ వర్షాలకు నివాస సముదాయాలు నీట మునిగాయి. ఓ వ్యక్తి తన ఇంటి బయట వరద నీటిలో నిలబడి ఉన్న వీడియో వైరల్ అయింది. ఇక్కడ పరిస్థితులు ఎంత దారుణంగా ఉన్నాయో ఆ వీడియో చూస్తే తెలుస్తోంది. ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాల కారణంగా వీధులు, రోడ్లు పూర్తిగా నీట మునిగిపోవడంతో, సదరు యువకుడు తన ఇంటి బయట మెడలోతు వరద నీటిలో నిలబడి పరిస్థితిని వివరించాడు. పార్క్ చేసిన వాహనాలు, ప్రహరీలు, భవనాల పైభాగాలు మాత్రమే బయటకు కనిపిస్తున్న ఈ దృశ్యాలు వరద తీవ్రతను స్పష్టంగా చూపిస్తున్నాయి. ఈ వీడియోలో సదరు వ్యక్తి మునిగిపోయే స్థాయిలో నీరు చేరడం చూసి నెటిజన్లు షాక్ అవుతున్నారు. వీధులు, ఖాళీ స్థలాల మధ్య తేడా తెలియకుండా అంతా జలమయం కావడంతో అక్కడి నివాసితుల దైనందిన జీవితం పూర్తిగా స్తంభించిపోయింది. పట్టణాల్లో అరకొరగా ఉన్న మురుగునీటి పారుదల వ్యవస్థలు, ఈ తరహా ముంపునకు ప్రధాన కారణమని ఆన్‌లైన్‌లో పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ దృశ్యాలు చూసిన పలువురు నెటిజన్లు శివమ్ సింగ్, ఇతర నివాసితులు సురక్షితంగా ఇళ్లలోనే ఉండాలని కోరారు. మరోవైపు అధికారులు, రెస్క్యూ టీమ్ ఇప్పటికే పలువురిని సురక్షిత ప్రదేశాలకు తరలించినట్లు సమాచారం.

## ఎఐతో ఉన్న భయాలు తొలగించాలి

### ఎఐప ఉన్న అపోహలు తొలగిస్తేనే భవిష్యత్

### మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్యనాదెళ్ల కీలక వ్యాఖ్యలు

**న్యూయార్క్:** ప్రపంచమంతా ఏఐ నామస్మరణ వినిపిస్తున్న నేపథ్యంలో మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్యనాదెళ్ల కీలక వ్యాఖ్యలు చేశారు. ఐటీ రంగంలో మానవ ఉద్యోగాలను భర్తీ చేస్తుందనే నిరంతర భయాల కారణంగా ప్రజలు ఏఐ రంగంపై విశ్వాసం కోల్పోతున్నారని పేర్కొన్నారు. వారి విశ్వాసాన్ని పునరుద్ధరించాలంటే కొన్ని చర్యలు తీసుకోక తప్పదని వ్యాఖ్యానించారు. ఉదాహరణకు ఒక సంస్థ డేటా సెంటర్‌ను నిర్మిస్తున్నట్లయితే.. స్థానిక ప్రజలకు అది ఎంత ఉపయోగకరమో వివరించాలన్నారు. అప్పుడే వారు దాని అవసరాన్ని గుర్తిస్తారన్నారు. ప్రస్తుతం ఉత్పాదకతను మెరుగుపరచడానికి మాత్రమే కాకుండా ఇతర పనులకు కూడా కృత్రిమ మేధను వినియోగిస్తున్నారని సత్యనాదెళ్ల అన్నారు. దీంతో రాబోయే ఏఐ యుగం.. మునుపటిలా కాకుండా భిన్నంగా ఉంటుందని పేర్కొన్నారు. మానవుల పరిజ్ఞానం, సృజనాత్మకత కు ఏఐ సాంకేతికత కలిస్తేనే భవిష్యత్ సంస్థలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ఏఐని స్వతంత్ర మేధస్సుగా చూడకూడదని.. మానవ ఆలోచనలను పెంచే, ప్రజల లక్ష్యాల సాధనకు దోహదపడే టూల్‌గా చూడాలన్నారు. ఉద్యోగాల నుంచి కార్మికులను తొలగించి వారి స్థానంలో ఏఐని తీసుకురాకుండా.. మానవ సామర్థ్యాలను పెంపొందించడానికి ఈ సాంకేతికతను ఉపయోగించాలని కంపెనీలకు ఆయన సూచించారు. మానవులు, ఏఐ వ్యవస్థలు ఒకరి నుంచి ఒకరు నిరంతరం నేర్చుకోగల దశలోకి ప్రస్తుత వ్యాపారాలు ప్రవేశిస్తున్నాయన్నారు. కొత్త ఉద్యోగాలను సృష్టించడానికి.. మంచి వేతనాలు నిర్ణయించడానికి కూడా ఏఐని వినియోగించాలని సూచించారు.

## హెచ్-1బీ వీసాలపై ట్రంప్ యంత్రాంగం అక్కసు

### మూడేళ్ల పాటలు వీసాలు నిలిపివేసే బిల్లుకు ప్రతిపాదన

### సెనెట్‌లో ప్రవేశపెట్టిన బిల్లు పెట్టిన రిపబ్లికన్ పార్టీ సభ్యుడు టిమ్ షీహ

**న్యూఢిల్లీ:** హెచ్-1బీ వీసాలపై ట్రంప్ యంత్రాంగం విధిస్తోన్న ఆంక్షలతో సతమతమవుతున్న భారతీయులను.. ఇప్పుడు మరో బిల్లు ఆందోళనకు గురిచేస్తోంది. రిపబ్లికన్ పార్టీ సభ్యుడు టిమ్ షీహి సెనెట్‌లో ప్రవేశపెట్టిన బిల్లులో.. కొత్త హెచ్-1బీ వీసాల జారీని మూడు సంవత్సరాల పాటు నిలిపివేయాలని ప్రతిపాదించారు. అలాగే ట్రంప్ యంత్రాంగం విధించిన లక్ష డాలర్ల ఫీజును చట్టబద్ధం చేయాలని పేర్కొన్నారు. అమెరికన్ కార్మికుల హక్కులకు భంగం కలిగించేలా ఉన్న వీసాలను జారీ చేయకూదని కోరారు. 'ఎండ్ హెచ్-1బీ వీసా యాక్ట్' పేరిట ప్రవేశపెట్టిన బిల్లులో ఈ ప్రతిపాదనలు చేశారు. కొన్ని ప్రత్యేక పోస్టులను నిపుణులైన విదేశీయులతో భర్తీ చేసేందుకు ఈ హెచ్-1బీ ప్రోగ్రామ్‌ను తీసుకువచ్చారు. అంతే గానీ అర్హత ఉండి కష్టపడి పనిచేసే అమెరికన్ల స్థానంలో తక్కువ వేతనాలకు లభ్యమయ్యే విదేశీ శ్రామికులతో భర్తీ చేయడానికి కాదు. నేను తీసుకువచ్చిన బిల్లు హెచ్-1బీ ప్రోగ్రామ్ అసలు ఉద్దేశాన్ని నెరవేర్చేందుకు ఉపయోగపడుతుంది. అందులోని లొసుగుల్ని ఉపయోగించుకోకుండా నివారిస్తుందని పేర్కొన్నారు. అందుకోసం మూడేళ్ల పాటు వీసా జారీని నిలిపివేసి, కఠిన నిబంధనలతో మళ్లీ కొత్తగా ఈ ప్రోగ్రామ్‌ను తీసుకురావాలని కోరారు. కొన్ని నెలల క్రితం రిపబ్లికన్ కాంగ్రెస్ సభ్యుడు ఎలీ క్రేన్ ప్రతినిధుల సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఏటా ఇస్తున్న 85,000 వీసాలను తగ్గించాలని.. లాటరీ విధానం కాకుండా అత్యధిక జీతం ఇచ్చే వారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వాలని.. హెచ్-1బీ వీసాదారులు భార్యాపిల్లలను అమెరికాకు తీసుకురావడంపై నిషేధం విధించాలనే ప్రతిపాదనలు ఈ బిల్లులో ఉన్నాయి. అయితే ఇది ఉభయసభల్లో ఆమోదం పొందిన తరవాతనే బిల్లుగా మారనుంది.

# కాక్రోచ్ గెలిచింది

### కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా

- ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు పరిహారం
- విద్యార్థులపై ఢిల్లీలో, రాష్ట్రాల్లో నమోదైన కేసుల విత్‌డ్రా
- భవిష్యత్తులోనూ వారి మీద ఎటువంటి చర్యలుండవు: నడ్డా
- ఉద్యమం నిలిపివేత.. త్వరలో భవిష్యత్తు కార్యాచరణ
- పరీక్షల నిర్వహణలో సంస్కరణలపై ప్రభుత్వంతో చర్చిస్తాం: సీజేపీ
- జస్టిస్ సూర్యకాంతకు కృతజ్ఞతలు.. ఆయన 'బొద్దింకల' వ్యాఖ్య వల్లే ఇది సాధ్యమైంది: అభిజిత్ దీప్కే
- జంతర్ మంతర్లో కన్నీళ్లు, కరచాలనాలతో భావోద్వేగాలు
- మా బిడ్డను తెచ్చివ్వలేరుగా.. బలైన విద్యార్థిని తల్లిదండ్రులు
- తర్వాతి టార్గెట్ ఉద్యోగాలే!.. ప్రభుత్వ హామీలపై దృష్టి



**న్యూఢిల్లీ :** 'యువతరం శిరమెత్తితే.. నవ తరం గళమిప్పితే లోకమే మారిపోదా.. ఈ చీకటే మాసిపోదా.. అన్న ట్లుగా భారతదేశ యువత తన సత్తా ఏమిటో చాటిచెప్పింది. కేవలం రెండున్నర నెలల వయసున్న పసికూన 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) సారథ్యంలో దేశవ్యాప్తంగా ఒక్కటైన విద్యార్థులు, యువత డిమాండ్ మేరకు.. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పదవికి రాజీనామా చేశారు. మరో రెండు డిమాండ్లు.. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు ఆర్థిక పరిహారం, విద్యార్థుల మీద నమో దైన కేసుల ఉపసంహరణకు కేంద్రప్రభుత్వం అంగీకరించింది. దీంతో గత 36 రోజులుగా ఢిల్లీలోని జంతర్మంతర్ కేంద్రంగా నడుపుతున్న ఉద్యమాన్ని నిలిపివేస్తున్నట్లుగా సీజేపీ ప్రకటించింది. నీట్ లీక్ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్వయంగా ప్రకటిం - చినప్పటికీ విద్యార్థులు ససేమిరా అనడంతో చివరకు ప్రభుత్వమే దిగివచ్చింది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసి తీరాల్సిందేనని, ఆ డిమాండ్ను 72 గంటల్లో అంగీకరించ కపోతే దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని, 20వ తేదీ నాటి 'చలో పార్లమెంటు' ర్యాలీని మించిన ర్యాలీ జరుపుతామని సీజేపీ శుక్రవారం హెచ్చరించిన నేపథ్యంలో.. ఇక ఎంత మాత్రం జాప్యం చేయటానికి వీల్లేదని గ్రహించి అన్ని డిమాండ్లనూ ఆమోదిం చింది. శనివారం మధ్యాహ్నం మూడు న్నర గంటలకు సీజేపీ ప్రతినిధులతో మంత్రుల చర్చలు ప్రారంభం కావడానికి గంట ముందే ధర్మేంద్ర ప్రధాన్ రాజీ నామా చేశారు. అనంతరం, కేంద్రమంత్రులు జేపీ నడ్డా, జితేంద్రసింగ్, సీజేపీ ప్రతినిధులు అశుతోష్ రంకా, సౌరవ్ దాస్ శనివారం ఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ క్లబ్లో సమావేశమయ్యారు. చర్చల అనంతరం సంయుక్తంగా విలేకరుల సమావేశం నిర్వహించారు. అన్ని డిమాండ్లనూ ప్రభుత్వం అంగీకరించిందని, ప్రభుత్వం పట్ల విశ్వాసంతో తాము ఉద్యమాన్ని విరమి స్తున్నామని అశుతోష్ తెలిపారు. నిరసన ప్రాంతాల నుంచి శాంతియుతంగా వెనక్కి వెళ్లిపోవాలని అంద రినీ కోరుతున్నామని పిలుపునిచ్చారు. సౌరవ్ దాస్ మాట్లాడుతూ పరీక్షల నిర్వహణలో సంస్కరణలకు సంబంధించి తాము రూపొందించిన అయిదు సూత్రాల చార్టర్ను కూడా ప్రభుత్వం పరిశీలిస్తోందని, నాలుగు వారాల తర్వాత మరోసారి ప్రభుత్వంతో చర్చలు జరుపుతామని చెప్పారు. విద్యార్థులపై క్రూరంగా లాఠీచారి' చేసిన రాపిడ్ యాక్షన్ ఫోర్స్ దళా అనుంచి క్షమాపణను కూడా తాము కోరినట్లు తెలి పారు. అనేక ఇతర అంశాలపై తమ భవిష్యత్ కార్యాచ రణను త్వరలో వెల్లడిస్తామన్నారు. ప్రభుత్వంతో తమ డిమాండ్లకు సంబంధించి కుదిరిన ఒప్పందంపై ముసాయిదాను రూపొందించామని, మంగళవారం నాటికి ఈ ఒప్పందాన్ని అధికారికంగా పంచుకుంటా మని ప్రభుత్వం తమకు చెప్పినట్లు సౌరవ్దస్ పేర్కొ న్నారు. జేపీ నడా మాట్లాడుతూ నీటి ప్రశ్నాపత్రాల లీకేజీ కారణంగా ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు నిబంధనల మేరకు గౌరవనీయమైన పరిహారం అందజేస్తామని తెలిపారు. రూ.కోటి చొప్పున ఇవ్వాలని సీజేపీ ఇప్పటి వరకూ డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. ఎంత పరిహారం ఇస్తామనేది మంత్రి స్పష్టం చేయలేదు. 'చలో పార్లమెంటు' తదితర సీజేపీ నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులందరిపై ఢిల్లీలో, బీజేపీ పాలిత రాష్ట్రాలలో దాఖలైన ఎస్ఐఆర్లను ఉపసంహరించుకోవడంతోపాటు సంబంధిత పత్రాలను మరో మూడు రోజుల్లో సీజేపీ ప్రతినిధులకు అందజే స్తామని నడ్డా తెలిపారు. భవిష్యత్తులోనూ ఆ విద్యార్థు లపై ఎలాంటి చర్యలు తీసుకోబోమని స్పష్టం చేశారు.

### చర్చలకు ముందే ప్రధాన్ రాజీనామా

మంత్రులు, సీజేపీ ప్రతినిధుల చర్చలకు ముందే.. ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేసి ప్రధాని మోదీకి సమర్పించారు. అనంతరం, రాజీనామాకు గల కారణాలను పేర్కొంటూ హిందీలో రాసిన ఓ పోస్ను ఎక్స్‌లో షేర్ చేశారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదించారు. ఈ మేరకు రాష్ట్రపతి కార్యాలయం నుంచి ఒక ప్రకటన వెలువ డింది.

## పది రోజుల పరిణామాలతో కలత చెందాను

- యువతను దుష్ప్రచారాల వలలో చిక్కుకోనివ్వను
- దేశ వ్యతిరేక శక్తులకు అవకాశం ఇవ్వొద్దనే రాజీనామా
- ఎక్స్‌లో యువతకు ధర్మేంద్ర ప్రధాన్ బహిరంగ లేఖ

**న్యూఢిల్లీ :** కేంద్ర విద్యా శాఖ మంత్రి పదవికి రాజీ నామా చేసిన ధర్మేంద్ర ప్రధాన్ శనివారం తన భావోద్వే గాలను దేశ యువతతో పంచుకున్నారు. ఈ మేరకు వారిని ఉద్దే శిస్తూ రాసిన లేఖను ట్విటర్ ద్వారా పంచు కున్నారు. గత 10 రోజులుగా జరు గుతున్న పరిణా మాలను చూసి తన మనసు తీవ్రంగా కలత చెందిందని ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు. రాజీనామా తన వ్యక్తిగత ప్రతిష్టకు సంబంధించిన విషయం కాదని స్పష్టం చేశారు. దేశ యువతను అపోహలు, దుష్ప్రచా రాల వలలో చిక్కుకొనివ్వనని, ఇదే తన సంకల్పమని ప్రకటిం చారు.జంతర్ మంతర్ తో పాటు దేశవ్యాప్తంగా ఏర్పడిన పరిస్థితులను దేశ వ్యతిరేక శక్తులు తమ ప్రయోజనాలకు వినియోగించుకోకుండా చూడా లన్న ఉద్దేశంతో, దేశ ఐక్యత నిలకడగా ఉండాలనే ఆకాంక్షతో. దేశంలోని ఒక్క విద్యార్థి భవిష్యత్తు కూడా చట్టపరమైన చిక్కుల్లో పడకూడదనే లక్ష్యంతో, విద్యార్థులు తమ సమయాన్ని చదువుకే కేటాయించి, కెరీర్ నిర్మాణంపై దృష్టి పెట్టాలన్న ఆలోచనలతో మంత్రి పదవికి రాజీనామా చేశా నని వివరించారు. దేశ ప్రజాస్వామ్య శక్తిపై ఎల్లప్పుడూ అచంచలమైన విశ్వాసం కలిగి ఉన్నానని తెలిపారు. దేశ యువత ఆశయాలు, కలలు, ఆకాంక్షల పట్ల తనకు అపార గౌరవం ఉందన్నారు. యువత కేవలం దేశ భవిష్యత్తు మాత్రమే కాదని, వికసిత భారత్ నిర్మాణానికి వారే ప్రధాన శిల్పులని చెప్పారు. యువశక్తే భారత్కు అసలైన బలమన్నారు. మే 3న జరిగిన నీట్ పరీక్షలో అక్రమాలు బయట పడ్డాయని, కేంద్రం వెంటనే రంగంలోకి దిగి దర్యాప్తును సీబీఐకి అప్పగించిందని చెప్పారు. నీట్ పరీ క్షను రద్దు చేసి, తిరిగి పరీక్ష తేదీని ప్రకటించి, రాష్ట్ర ప్రభుత్వాలు, విద్యా ర్థులు, తల్లిదండ్రుల సహకారంతో జూన్ 21న నీట్ను నిర్వహించామని తెలిపారు. వచ్చే ఏడాది నుంచి నీట్ పరీక్షను సీబీటీ విధానంలో నిర్వహిం చాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. నీట్ లీకేజీ ఘటనకు మొదటి రోజు నుంచే బాధ్యత వహించానన్నారు. ఈ పరిస్థితి నుంచి ఎప్పుడూ వెనక డుగు వేయలేదని స్పష్టం చేశారు. జూలై 16న ప్రకటించిన నీట్ ఫలితాలు సంతృప్తికరంగా ఉన్నాయని, అనేక మంది ప్రతిభావంతులైన పేద విద్యా ర్థులు విజయం సాధించారని చెప్పారు. నాలుగు దశాబ్దా లుగా విద్యా సంస్కరణల కోసం అంకితభావంతో పని చేశానని ధర్మేంద్ర ప్రధాన్ తెలి పారు. ప్రధాని మోదీ తనపై ఉంచిన విశ్వాసం, నిరంతర సహకారానికి కృతజ్ఞ తలు తెలియజేశారు. దేశానికి సేవ చేసేందుకు ఎప్పటికీ అంకితభా వంతో సిద్ధంగా ఉంటానని ప్రకటించారు.

## ధర్మేంద్ర రాజీనామాతో జంతర్‌మంతర్ వద్ద ఉద్రిక్తత

**న్యూఢిల్లీ :** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ప్రకటించిన వెంటనే ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. నిరసనకారులు పోలీసులపై రాళ్ల దాడికి దిగారు. నిరసనకారుల రాళ్లదాడిలో ఇద్దరు పోలీసులు గాయపడ్డారు. వారి తలలకు తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడ్డ పోలీసులను వెంటనే ఆస్పత్రికి తరలించారు. పరిస్థితిని అదుపు చేసేందుకు పోలీసులు భాష్పవాయు గోళాలు ప్రయోగించారు. నిరసనకారులపై లాఠీఛార్జ్ చేశారు. ఈ నేపథ్యంలోనే జంతర్ మంతర్ వద్ద అదనపు బలగాలు మోహరించాయి. ప్రస్తుతం అక్కడి పరిస్థితి అదుపులోనే ఉన్నట్లు సమాచారం. మరోవైపు విద్యార్థులు సంబరాల్లో మునిగిపోయారు. అభిజిత్‌ను అభినందిస్తూ భుజాలపైకి ఎత్తుకున్నారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే హర్షం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యం, విద్యార్థులు సాధించిన విజయంగా పేర్కొన్నారు. నీట్ పేపర్ లీక్ వివాదంపై కొన్ని వారాలుగా కొనసాగిన నిరసనల ఫలితంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకునేలా విద్యార్థులు ఒత్తిడి తెచ్చారని అన్నారు. ప్రజాస్వామ్య విలువలకు, దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థుల సామూహిక సంకల్పానికి లభించిన విజయమని ఆయన అభివర్ణించారు. కాగా, నిరంతర శాంతియుత నిరసనలు మార్పును తీసుకురాగలవని చెప్పడానికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ఒక నిదర్శనమని అభిజీత్ దిప్కే తెలిపారు. 'ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. మీరు భయపడకపోతే, ఈ ప్రభుత్వానికి తలొగ్గకపోతే, మనం ఎవరితోనైనా రాజీనామా చేయించగలమని చెప్పడానికి ఇది నిదర్శనం' అని అన్నారు. అలాగే నీట్ పేపర్ లీక్ వివాదం తర్వాత ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల పేర్లను దీప్కే గుర్తు చేసుకున్నారు. వారి స్మృతి కోసం రెండు నిమిషాల పాటు మౌనం పాటించాలని నిరసనకారులను కోరారు. అనంతరం ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై నిరసన ప్రాంగణంలో విద్యార్థుల సంబరాలు హోరెత్తాయి.



విద్యావ్యవస్థపై లోపాలను ఎత్తిచూపుతూ పుట్టుకొచ్చిన పార్టీనే సీజేపీ సరిగ్గా రెండు నెలల క్రితం అభిజీత్ దీప్కే దీనిని ఏర్పాటు చేశారు. కొన్ని గంటల్లోనే ఇంటర్నెట్‌లో దాని పేరు మార్మోగిపోయింది. తర్వాత నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో దీప్కే జంతర్ మంతర్ వద్ద ప్రారంభించిన నిరసనలకు భారీ సంఖ్యలో యువత స్పందించింది. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు నిరసన వేదికవద్దకు వచ్చి మద్దతు తెలిపారు. జులై 20న 'చలో పార్లమెంట్' మార్చ్, ప్రధాన్ రాజీనామా నుంచి సీజేపీ వెనక్కి తగ్గకపోవడంతో ప్రభుత్వం దిగిరావాల్సి వచ్చింది. ఈ పరిణామాల్లో కీలకంగా వ్యవహరించిన 30 ఏళ్ల దీప్కే.. మహారాష్ట్రలోని పుణెలో జర్నలిజం చదివారు. అమెరికాలోని బోస్టన్ యూనివర్సిటీ నుంచి పబ్లిక్ రిలేషన్స్‌లో మాస్టర్స్ చేశారు.

## విద్యాశాఖ ప్రహ్లాద్ జోషికి

### ప్రస్తుతం ఉన్న శాఖలకు ఇది అదనం

**న్యూఢిల్లీ:** ధర్మేంద్ర ప్రధాన్ విద్యా మంత్రి పదవి నుంచిరాజీనామా చేసిన తర్వాత కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి విద్యా మంత్రిత్వ శాఖ అదనపు బాధ్యతలు చేపట్టనున్నారు.ప్రధాని నరేంద్రమోడీ సలహామేరకు రాష్ట్రపతి జోషికి విద్యా మంత్రిత్వ శాఖ అదనపు బాధ్యతలు అప్పగించారని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఆయన ప్రస్తుతం వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజాపంపిణీ, నూతన పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖలను నిర్వహిస్తున్నారు. ఈ కొత్త బాధ్యతతో పాటు ఆయన ఇప్పటికే ఉన్న పోర్ట్ఫోలియోను కూడా కొనసాగిస్తారు. ఇటీవల నిరసనల సమయంలో కేంద్రం తరపున చర్చల్లో జోషి కీలక పాత్ర పోషించారు.

## విద్యార్థులే నిజమైన దేశభక్తులు

### ఉద్యమించిన విద్యార్థులకు హ్యాట్సాఫ్

### రాహుల్, ప్రియాంకల హర్షం

**న్యూఢిల్లీ :** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ స్పందించారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా ఉద్యమించిన విద్యార్థులకు హ్యాట్సాఫ్ చెబుతూ, వారే నిజమైన దేశభక్తులని కొనియాడారు. విద్యార్థులు తమ హక్కుల కోసం, పారదర్శకమైన విద్యా వ్యవస్థ కోసం చేసిన పోరాటం దేశ ప్రజాస్వామ్య స్ఫూర్తికి నిదర్శనమని రాహుల్ పేర్కొన్నారు. వారి ఐక్యత, పట్టుదల చూస్తే గర్వంగా ఉందని ఆయన అన్నారు. ఈ పరిణామం విద్యా రంగంలో సంస్కరణలకు దారి తీస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 'విద్యార్థులపై ఎవరైతే దాడి చేసి, వారిని కొట్టి, వారిపై కాల్పులు జరిపారో, వారందరికీ శిక్ష పడాల్సిందే. ఈ విషయాన్ని ప్రభుత్వానికి మరోసారి గుర్తు చేస్తున్నాను' అని రాహుల్ పేర్కొన్నారు. అలాగే, దేశ విద్యార్థుల గౌరవం, వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని భారత ప్రధానమంత్రి దాడులకు గురైన విద్యార్థులకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థుల ఆకాంక్షలను గౌరవిస్తూ ప్రభుత్వం విద్యా వ్యవస్థను మరింత పారదర్శకంగా, బాధ్యతాయుతంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని రాహుల్ గాంధీ సూచించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంపై కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ హర్షం వ్యక్తం చేశారు. ఇది దేశ యువత సాధించిన విజయమని ఆమె పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల ఆకాంక్షలే అంతిమమని, యువత తమ గళాన్ని వినిపించి కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం చెప్పిందని అన్నారు. విద్యా వ్యవస్థలో నెలకొన్న సమస్యలపై విద్యార్థులు చేసిన పోరాటం ఫలించిందని ప్రియాంక గాంధీ వ్యాఖ్యానించారు. ఇది కోట్లాది మంది విద్యార్థుల విజయమని తెలిపారు. విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావాలనే లక్ష్యంతో విద్యార్థులు పెద్ద ఎత్తున ఉద్యమించారని, వారి పోరాటం దేశవ్యాప్తంగా చర్చకు దారితీసిందని అన్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం మరింత బాధ్యతగా వ్యవహరించాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. విద్యా వ్యవస్థలో పారదర్శకత, నాణ్యత పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

# రెండో టీ20లో టీమిండియా భారీ విజయం

**జింబాబ్వేపై సిరీస్ కైవసం**

**బ్యాటింగ్, బౌలింగ్‌లో అదరగొట్టిన భారత్**


**రెండో టీ20లో 90 పరుగుల భారీ తేడాతో విజయం**

**అర్ధ సెంచరీలతో చెలరేగిన ఇషాన్ కిషన్, తిలక్ వర్మ**

**బౌలింగ్‌లో 3 వికెట్లతో రాణించిన అభిషేక్ శర్మ**



జింబాబ్వే పర్యటనలో భారత జట్టు అద్భుత ప్రదర్శనను కొనసాగిస్తోంది. శనివారం హరారే వేదికగా జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టింది. ఈ మ్యాచ్‌లో 90 పరుగుల భారీ తేడాతో జింబాబ్వేను చిత్తు చేసి, మరో మ్యాచ్ మిగిలి ఉండగానే మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-0 తేడాతో కైవసం చేసుకుంది. తొలుత బ్యాటింగ్‌లో ఇషాన్ కిషన్, తిలక్ వర్మ విధ్వంసకర ఇన్నింగ్స్‌లతో చెలరేగగా, అనంతరం బౌలర్లు రాణించడంతో భారత్‌కు సునాయాస విజయం దక్కింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన జింబాబ్వే కెప్టెన్ సికిందర్ రజా బౌలింగ్ ఎంచుకున్నాడు. అయితే, అతని నిర్ణయం సరైంది కాదని భారత బ్యాటర్లు నిరూపించారు. ఓపెనర్లు అభిషేక్ శర్మ (8), వైభవ్ సూర్యవంశీ (20) త్వరగా పెవిలియన్ చేరినా, క్రీజులోకి వచ్చిన వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ (44 బంతుల్లో 81; 9 ఫోర్లు, 2 సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగాడు. అతనికి తిలక్ వర్మ (29 బంతుల్లో 60 నాటౌట్; 5 ఫోర్లు, 3 సిక్సర్లు) తోడవడంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. వీరిద్దరూ అద్భుతమైన అర్ధ సెంచరీలతో భారత జట్టు భారీ స్కోరుకు బాటలు వేశారు. టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 219 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. భారీ లక్ష్య ఛేదనలో జింబాబ్వే ఏ దశలోనూ గెలుపు దిశగా సాగలేకపోయింది. ఓపెనర్ బ్రయాన్ బెన్నెట్ (19 బంతుల్లో 32 పరుగులు) దూకుడుగా ఆడినా, భారత బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు తీస్తూ ఒత్తిడి పెంచారు. కెప్టెన్ సికిందర్ రజా డకౌట్‌గా వెనుదిరగడం ఆ జట్టును కోలుకోలేని దెబ్బతీసింది. భారత బౌలర్లలో పార్ట్ టైమ్ స్పిన్నర్ అభిషేక్ శర్మ కేవలం 17 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టి జింబాబ్వే పతనాన్ని శాసించాడు. యశ్ ఠాకూర్, ప్రిన్స్ యాదవ్ చెరో రెండు వికెట్లు తీయగా.. రవి బిష్ణోయ్, శివమ్ దూబే, తిలక్ వర్మ తలో వికెట్ దక్కించుకున్నారు. దీంతో జింబాబ్వే 17.5 ఓవర్లలో 129 పరుగులకే ఆలౌట్ అయి ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. ఇక ఇరు జట్ల మధ్య మూడో టీ20 జులై 26 జరగనుంది. ఈ మ్యాచ్ కు కూడా హరారే స్పోర్ట్స్ క్లబ్ మైదానం వేదికగా నిలవనుంది.




## ఫిఫా వరల్డ్ కప్‌ల నుంచి అర్జెంటీనాను నిషేధించాలంటూ పిటిషన్

**మండిపడిన దేశాధ్యక్షుడు**

ఫుట్‌బాల్ ప్రపంచంలో ఒక కొత్త వివాదం రాజుకుంది. భవిష్యత్తులో జరిగే ఫిఫా వరల్డ్ కప్‌ల నుంచి అర్జెంటీనాను నిషేధించాలంటూ దాఖలైన భారీ ఆన్‌లైన్ పిటిషన్‌పై ఆ దేశ అధ్యక్షుడు జేవియర్ మిలే తీవ్రంగా స్పందించారు. "ఇదంతా మాపై ఉన్న అసూయతోనే జరుగుతోంది" అంటూ ఆయన సోషల్ మీడియాలో ఆగ్రహం వ్యక్తం చేశారు. 2026 ఫిఫా వరల్డ్ కప్ ఫైనల్లో అర్జెంటీనా, స్పెయిన్ చేతిలో 1-0 తేడాతో ఓటమి పాలైన విషయం తెలిసిందే. ఈ టోర్నమెంట్‌లో అర్జెంటీనా జట్టు ఆటగాళ్ల ప్రవర్తన సరిగా లేదని, క్రమశిక్షణ ఉల్లంఘనలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ "అర్జెంటీనా ఔట్" పేరుతో ఒక పిటిషన్ మొదలైంది. దీనికి అనూహ్య స్పందన లభించింది. సుమారు 170 దేశాల నుంచి 2.33 కోట్ల మందికి పైగా ఈ పిటిషన్‌పై సంతకాలు చేశారు. అర్జెంటీనా ప్రవర్తన ఫుట్‌బాల్ క్రీడా స్ఫూర్తిని దెబ్బతీసిందని పిటిషన్‌లో ఆరోపించారు. ఈ పిటిషన్‌పై అధ్యక్షుడు మిలే ఇన్‌స్టాగ్రామ్‌లో స్పందిస్తూ, "మీకు శత్రువులు ఉన్నారంటే.. మీరు ఎప్పుడో ఒకప్పుడు దేనికోసమో బలంగా నిలబడ్డారని అర్థం. మేము అర్జెంటీనా కోసం నిలబడతాం. అందరిలో మేం ప్రత్యేకంగా నిలబడటమే అసలు సమస్య. మాపై అసూయ పడతారు. మేము దాదాపు అన్నింటిలోనూ ఉత్తమంగా ఉంటాం" అని పోస్ట్ చేశారు.



## కూరగాయల వ్యాపారి కొడుకు అద్భుతం

**కామన్వెల్త్‌లో భారత్‌కు తొలి మెడల్**

కామన్వెల్త్ క్రీడలు 2026లో భారత్ పతకాల బోణీ కొట్టింది. పారా పవర్‌లిఫ్టర్ జండు కుమార్ దేశానికి తొలి పతకాన్ని అందించి సత్తా చాటాడు. నిన్న జరిగిన పురుషుల హెవీవెయిట్ కేటగిరీ పోటీల్లో కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. 72.4 కిలోల బరువున్న జండు కుమార్, తన రెండో ప్రయత్నంలో 190 కిలోల బరువును విజయవంతంగా ఎత్తి పతకాన్ని ఖాయం చేసుకున్నాడు. మూడో ప్రయత్నంలో 196 కిలోలు ఎత్తడంలో స్వల్ప తేడాతో విఫలమయ్యాడు. పోటీల్లో చాలాసేపు ఆధిక్యంలో ఉన్నప్పటికీ, చివరికి మూడో స్థానంలో నిలిచి కాంస్యంతో సరిపెట్టుకున్నాడు. బిహార్‌లోని నలందా జిల్లా హర్నాత్ గ్రామానికి చెందిన జండు కుమార్ ప్రస్థానం ఎంతో స్ఫూర్తిదాయకం. ఓ సాధారణ కూరగాయల వ్యాపారి కుమారుడైన జండు, పుట్టుకతోనే పోలియో బారినపడ్డాడు. అయినప్పటికీ ఎన్నో శారీరక, ఆర్థిక సవాళ్లను అధిగమించి అంతర్జాతీయ క్రీడా వేదికపై నిలిచాడు. ఆసక్తికరంగా జండు క్రీడా జీవితం పవర్‌లిఫ్టింగ్‌తో మొదలుకాలేదు. 2017లో షాట్‌పుట్, డిస్కస్ త్రో అథ్లెట్‌గా కెరీర్ ప్రారంభించి జిల్లా, రాష్ట్ర స్థాయి పతకాలు కూడా సాధించాడు. జిమ్‌లో శిక్షణ తీసుకుంటున్నప్పుడు పవర్‌లిఫ్టింగ్‌పై ఆసక్తి పెంచుకుని, ఆ తర్వాత ఈ క్రీడలోకి మారాడు. అయితే, అతని ప్రయాణం అంత సులువుగా సాగలేదు. ఉన్నతస్థాయి పోటీలకు అవసరమైన పోషకాహారం కూడా కొనుగోలు చేయలేని దుస్థితిలో, జీవనోపాధి కోసం కూరగాయల వ్యాపారం నడిపారు. కనీసం వీల్‌చైర్ కూడా లేని స్థితిలో, రోజూ 20 కిలోమీటర్లు ప్రయాణించి స్థానిక మార్కెట్లకు వెళ్లేవాడు. స్నేహితుల వద్ద అప్పు చేసి కొన్న ఈ-రిక్షా వ్యాపారం కూడా కరోనా మహమ్మారి కారణంగా దెబ్బతింది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో పారాలింపిక్ కాంస్య పతక విజేత రాజిందర్ సింగ్ రహేలు.. జండులోని ప్రతిభను గుర్తించాడు. గాంధీనగర్‌లోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎస్ఏఐ) సెంటర్‌లో శిక్షణకు ఆహ్వానించాడు. రాజిందర్ మార్గదర్శకత్వంలో జండు కుమార్ అద్భుతంగా రాటుదేలాడు.

## యూత్ హాకీ ఫైవ్స్ ఆసియా కప్‌లో భారత్ జోరు..

**పాకిస్థాన్‌పై 7-3తో ఘనవిజయం!**




ఎఫ్ఐహెచ్ యూత్ హాకీ ఫైవ్స్ ఆసియా ఛాంపియన్‌షిప్ 2026లో భారత సబ్‌జూనియర్ పురుషుల జట్టు అద్భుత ప్రదర్శనతో దూసుకుపోతోంది. శుక్రవారం ఒమన్ వేదికగా జరిగిన మ్యాచుల్లో భారత్ రికార్డు విజయాలను సొంతం చేసుకుంది. ఒకే రోజులో మొదట ఆతిథ్య ఒమన్ జట్టును 10-1 తేడాతో చిత్తు చేసిన భారత్, ఆ తర్వాత జరిగిన హై-వోల్టేజ్ పోరులో సంప్రదాయ ప్రత్యర్థి పాకిస్థాన్‌ను 7-3తో ఓడించి తన ఆధిపత్యాన్ని చాటుకుంది. పాకిస్థాన్‌తో జరిగిన ఉత్కంఠభరిత పోరులో మ్యాచ్ ఆరంభం నుంచే భారత్ పూర్తి నియంత్రణ సాధించింది. ప్రథమార్ధంలోనే రోమిత్ పాల్ (8వ నిమిషం), కరణ్ గౌతమ్ (10వ నిమిషం), కెప్టెన్ కేతన్ కుష్వాహా (10వ నిమిషం) మెరుపు గోల్స్ సాధించడంతో భారత్ 3-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ద్వితీయార్ధంలో ప్రహ్లాద్ రాజ్‌భర్ (12వ నిమిషం) గోల్ కొట్టడంతో స్కోరు 4-0గా మారింది. ఆ తర్వాత పాకిస్థాన్ పుంజుకునే ప్రయత్నం చేసినప్పటికీ.. షారూఖ్ అలీ (16వ నిమిషం), రాహుల్ యాదవ్ (18వ నిమిషం), కుష్వాహా (20వ నిమిషం) వరుస గోల్స్‌తో విరుచుకుపడి 7-3తో భారత్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించారు.

### ఒమన్‌పై 10-1తో గోల్స్ వర్షం!

అంతకుముందు రోజు జరిగిన మ్యాచ్‌లో ఆతిథ్య ఒమన్‌ను భారత జట్టు కకావికలం చేసింది. ప్రథమార్ధంలోనే 6-0 ఆధిక్యంలో నిలిచిన భారత్, మ్యాచ్ ముగిసేసరికి 10-1తో తిరుగులేని విజయాన్ని ఖాయం చేసుకుంది. కెప్టెన్ కేతన్ కుష్వాహా ఏకంగా నాలుగు గోల్స్‌తో విరుచుకుపడగా.. షారూఖ్ అలీ, కరణ్ గౌతమ్, ప్రహ్లాద్ రాజ్‌భర్‌లు తలో రెండు గోల్స్‌తో చెలరేగారు. ఒమన్ తరఫున చివరి నిమిషంలో ఖ్రాజ్ ఒక గోల్ సాధించాడు.

### చైనా చేతిలో పోరాడి ఓడిన మహిళల జట్టు

మరోవైపు మహిళల విభాగానికి సంబంధించిన ఎలైట్ పూల్ మ్యాచ్‌లో భారత సబ్‌జూనియర్ మహిళల జట్టు చైనా చేతిలో 3-6 తేడాతో ఓటమి పాలైంది. ప్రథమార్ధంలో రెండు జట్లు 3-3తో సమానంగా నిలిచి గట్టి పోటీ ఇచ్చాయి. భారత్ తరఫున కిరణ్ ఎక్కా రెండు గోల్స్, సందీప కుమారి ఒక గోల్ సాధించారు. అయితే ద్వితీయార్ధంలో చైనా ప్లేయర్ గువో జియాక్సిన్ హ్యాట్రిక్ గోల్స్‌తో విజృంభించడంతో భారత మహిళలకు ఓటమి తప్పలేదు. తొలిసారిగా జరగనున్న ఎఫ్ఐహెచ్ యూత్ హాకీ ఫైవ్స్ వరల్డ్ కప్‌కు ఈ టోర్నీ ఆసియా ఖండం తరఫున అర్హత పోటీగా నిలవనుంది.



## షమీని జీరో చేశారు.. బుమ్రా లేకపోతే కప్ గెలవలేం: శ్రీకాంత్

టీమిండియా మాజీ కెప్టెన్, ప్రముఖ కామెంటేటర్ కృష్ణమాచారి శ్రీకాంత్.. భారత జట్టు బౌలింగ్ వనరులపై, 2027 ప్రపంచకప్ సన్నాహకాలపై సంచలన వ్యాఖ్యలు చేశాడు. ముఖ్యంగా సీనియర్ పేసర్ మహమ్మద్ షమీని జట్టు యాజమాన్యం పూర్తిగా విస్మరించడంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. గత ప్రపంచకప్‌లో హీరోగా నిలిచిన ఆటగాడిని ఇప్పుడు అనామకుడిగా మార్చేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. స్టార్ స్పోర్ట్స్ నిర్వహించిన ఒక చర్చా కార్యక్రమంలో శ్రీకాంత్ మాట్లాడుతూ.. "2023 ప్రపంచకప్‌లో 24 వికెట్లతో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచిన ఆటగాడు మహమ్మద్ షమీ. అలాంటి అద్భుతమైన బౌలర్‌ను యాజమాన్యం ఇప్పుడు పూర్తిగా పక్కనపెట్టడం నాకు చాలా ఆశ్చర్యం కలిగిస్తోంది. అతడిని ఒక రకంగా ఎవరూ పట్టించుకోని వ్యక్తిగా (నోబడీ) మార్చేశారు" అని అన్నాడు. 2025 ఛాంపియన్స్ ట్రోఫీ తర్వాత షమీ ఒక్క అంతర్జాతీయ మ్యాచ్ కూడా ఆడలేదని, దేశవాళీ క్రికెట్‌లో రాణిస్తున్నా అతనికి అవకాశం ఇవ్వకపోవడం దారుణమని పేర్కొన్నాడు. అదే సమయంలో స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా ప్రాముఖ్యతను శ్రీకాంత్ నొక్కిచెప్పాడు. "ప్రపంచకప్‌లో భారత్ గెలవాలంటే బుమ్రానే కీలకం. అతను జట్టులో ఉంటేనే భారత్‌కు ప్రపంచకప్ గెలిచే అవకాశం ఉంది. బుమ్రా లేకపోతే, మిగతా బౌలర్లతో ఆ ఛాన్స్ లేదు. అతను టీమిండియాకు దొరికిన ఓ అన్‌కట్ డైమండ్. ప్రపంచకప్ సమీపిస్తున్న వేళ బుమ్రా వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్ చాలా ముఖ్యం" అని స్పష్టం చేశాడు. మరోవైపు యువ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ వన్డే ఫార్మాట్‌కు సరిపోడని శ్రీకాంత్ కుండబద్దలు కొట్టాడు. "అర్ష్‌దీప్ 50 ఓవర్ల ఆటకు సరిపోడు. బంతి స్వింగ్ అయితేనే అతని బౌలింగ్ ప్రభావవంతంగా ఉంటుంది. రెండు ఓవర్ల తర్వాత స్వింగ్ ఆగిపోతే తేలిపోతాడు. ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్‌లోనూ ఇదే చూశాం. మొదటి ఓవర్ అద్భుతంగా వేశాడు, ఆ తర్వాత బ్యాటర్లు అతడిని చితక్కొట్టారు" అని విశ్లేషించాడు. దక్షిణాఫ్రికా పిచ్‌లపై ప్రసిద్ధ్ కృష్ణ, మహమ్మద్ సిరాజ్ రాణించగలరని, వారితో పాటు ప్రిన్స్ యాదవ్, గుర్నూర్ బ్రార్, మొహ్సిన్ ఖాన్ వంటి యువ బౌలర్లను కూడా దృష్టిలో ఉంచుకోవాలని సూచించాడు.



# మెగా 158లో డాక్టర్ భద్రం కీలక రోల్

## చిరును కలిసి కృతజ్ఞతలు తెలిపిన సోము వీర్రాజు


మెగాస్టార్ చిరంజీవి కొత్త ప్రతిభను ప్రోత్సహించడంలో ఎప్పుడూ ముందుంటారనే విషయం మరోసారి చర్చనీయాంశమైంది. దర్శకుడు బాబీ తెరకెక్కిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం మెగా158 లో ప్రముఖ హాస్యనటుడు డాక్టర్ భద్రంకు కీలక పాత్ర దక్కడం ఇప్పుడు సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ సందర్భంగా ఏపీ బీజేపీ నేత, ఎమ్మెల్సీ సోము వీర్రాజు స్వయంగా చిరంజీవిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.డాక్టర్ భద్రం తన అల్లుడు కావడంతో, ఆయనకు ఇలాంటి మంచి అవకాశం కల్పించినందుకు చిరంజీవికి వ్యక్తిగతంగా ధన్యవాదాలు తెలిపినట్లు సోము వీర్రాజు వెల్లడించారు. ఈ భేటీకి సంబంధించిన ఫొటోలు, వివరాలను సోషల్ మీడియా ద్వారా పంచుకోవడంతో అవి ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. ఈ సందర్భంగా సోము వీర్రాజు మాట్లాడుతూ, కొత్త నటీనటులకు అవకాశాలు కల్పిస్తూ వారి ప్రతిభను వెలుగులోకి తీసుకురావడంలో చిరంజీవి ఎప్పుడూ ముందుంటారని కొనియాడారు. కళాకారులను ప్రోత్సహించే ఆయన విశాల హృదయం ఎంతోమందికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.ఇదిలా ఉంటే, 'వాల్తేరు వీరయ్య' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత చిరంజీవి?బాబీ కాంబినేషన్‌లో వస్తున్న మెగా158 పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటోంది.ఈ చిత్రంలో డాక్టర్ భద్రంకు కథలో ప్రాధాన్యం ఉన్న పాత్ర లభించినట్లు సమాచారం. కమెడియన్‌గా ఇప్పటికే మంచి గుర్తింపు సంపాదించిన భద్రం, మెగాస్టార్‌తో కలిసి నటించే అవకాశం తన కెరీర్‌లో మరో కీలక మైలురాయిగా నిలవనుంది. ముఖ్యంగా 'ప్రతి రోజూ పండగే' చిత్రంలో తన కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకులను ఆకట్టుకున్న డాక్టర్ భద్రం, ఇప్పుడు చిరంజీవితో స్క్రీన్ షేర్ చేసుకోనుండటంతో ఆయన పాత్ర ఎలా ఉండబోతుందన్న ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. మెగా158 లో చిరంజీవి మరోసారి పవర్‌ఫుల్ మాస్ అవతార్‌లో కనిపించనున్నారని, దర్శకుడు బాబీ తనదైన శైలిలో కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారని టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి.

# హాలీవుడ్ సినిమాలకు దీటుగా 'రామాయణ'

## ప్రపంచ నలుమూలలకు వెళ్తుందని ఇన్‌స్టాలో పోస్ట్

నితేశ్ తివారీ దర్శకత్వంలో భారీ హంగులతో రూపుదిద్దుకుంటున్న సినిమా 'రామాయణ'. శ్రీరాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణుడిగా యశ్ నటిస్తున్నారు. శుక్రవారం విడుదల కావాల్సిన ఈ సినిమా ట్రైలర్ చివరి నిమిషంలో వాయిదా పడింది. అంతర్జాతీయ స్థాయిలో విడుదల చేయాలని భావించి ట్రైలర్‌ని వాయిదా వేస్తున్నాం. హాలీవుడ్ సినిమాలకు దీటుగా 'రామాయణ' ప్రపంచ నలుమూలలకు వెళ్తుందని పేర్కొంటూ ఇన్‌స్టాలో పోస్ట్ చేశారు నిర్మాత నమిత్ మల్హోత్రా. ఈ సినిమా ప్రచార కార్యక్రమాల్లో భాగంగా అమెరికాలో జరుగుతోన్న శాన్ డియాగో కామిక్-కాన్ 2026 వేడుకల్లో చిత్రబృందం పాల్గొంది. ఈ సందర్భంగా వేడుకలో రణ్‌బీర్ మాట్లాడుతూ.. ఈ సినిమాలో అవకాశం వచ్చినప్పుడు నాలో చాలా భయం, సందేహం ఉండేవి. 'నేను ఇది చేయగలనా, నాకు అంత సామర్థ్యం ఉందా?' అనిపించేది. కానీ ఆ సందేహం చాలా త్వరగానే కృతజ్ఞతా భావంగా మారింది. ఇదొక వరం. జీవితంలో ఒక్కసారి మాత్రమే లభించే అవకాశం. తరతరాలుగా శ్రీరాముడు ఎంతో మందికి ఆత్మ రక్షకుడిగా ఉన్నారు. ధైర్యం, కరుణ, క్షమ, ధర్మం లాంటి వాటికి ఆయన ప్రతీకగా నిలుస్తారు. అలాంటి లక్షణాలకు ప్రాతినిధ్యం వహించే అవకాశం రావడం చాలా గొప్ప విషయం. దీనికి చాలా విశ్వాసం, నమ్మకం, నిజాయతీ అవసరమని ప్రారంభంలోనే అర్థం చేసుకున్నా.ఈ కథను ధ్యమైనంత వాస్తవికంగా చెప్పాలన్నదే మా నటీనటులు, సిబ్బందిల ఉన్నతమైన ఉద్దేశం అన్నారు. యశ్ మాట్లాడుతూ.. 'ఈ ప్రపంచంలో ఎవరూ వచ్చి 'నేను శ్రీరాముడి పాత్ర పోషించగలన'ని చెప్పలేరు. ఈ పాత్ర పోషించడం అంత సులభం కాదు. రణ్‌బీర్ గొప్పగా నటించారు. సినిమా చూసినప్పుడు అతని నిబద్ధత కనిపిస్తుంద'ని అన్నారు. రెండు భాగాలుగా విడుదల అవనున్న ఈ సినిమా మొదటి భాగం దీపావళికి థియేటర్లలోకి రానుంది.

# సౌండ్ ఇంజనీర్‌గా వస్తోన్న నారా రోహిత్




కథానాయకుడు నారా రోహిత్ జోరుమీదున్నారు. ఒకప్పుడు వైవిధ్యమైన కథలు, పాత్రలు ఎంచుకుని అలరించేవారు. ఆయన నుంచి సినిమా వస్తుందంటే ఏదో కొత్తదనం ఉందనే భావన ప్రేక్షకులకు కలిగేది. అయితే, కొంతకాలం విరామం తీసుకున్న నారా రోహిత్ గతేడాది 'భైరవం', 'సుందరకాండ' చిత్రాలతో మళ్లీ ట్రాక్‌లోకి వచ్చారు. ఇప్పుడు మరోసారి వరుస చిత్రాలతో అలరించడానికి సిద్ధమయ్యారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా కొత్త సినిమాల కబుర్లు పంచుకుంటున్నారు. రామ్ గన్నీ దర్శకత్వంలో రోహిత్ ఓ సినిమాలో నటిస్తున్నారు. దీనికి 'కపాలి' అనే టైటిల్, ఫస్ట్‌లుక్‌ను తాజాగా విడుదల చేశారు. పురాణాంశాలతో నిండిన సైకలాజికల్ హారర్ థ్రిల్లర్‌గా ఇది రూపొందుతోంది. ఇక వెంకటేశ్-త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందుతోన్న 'ఆదర్శ కుటుంబం: హౌస్ నెం.47'లోనూ నారా రోహిత్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇందులో ఆయన పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనున్నారు. ఈ లుక్‌ను కూడా చిత్ర నిర్మాణ సంస్థ హారిక హాసిని క్రియేషన్స్ శనివారం సోషల్‌మీడియా వేదికగా పంచుకుంది. దీంతో పాటు, చినిమిల్లి మణికుమార్ దర్శకత్వంలో ఓ వైవిధ్యమైన కథలో నారా రోహిత్ మెరవనున్నారు. ఈ సినిమాకు 'సౌండ్ ఇంజినీర్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. పూర్తి వినోదాత్మక చిత్రంగా దీన్ని తీర్చిదిద్దుతున్నట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది. నయన్‌సారిక, నరేశ్, రోహిణి, అజయ్, వెన్నెల కిషోర్, సుదర్శన్, బ్రహ్మాజీ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.



# మంచి పాత్రల కోసమే వేచి చూస్తున్నా..

## పెళ్లికి కూడా తొందరలేదు: నిధి అగర్వాల్

సినిమా అవకాశాల కోసం తాను ఎప్పుడూ తొందరపడనని... జీవితంలో సినిమాలైనా, పెళ్లయినా దేనికీ హడావుడి పడేది లేదని నటి నిధి అగర్వాల్ స్పష్టం చేసింది. మంచి కథలు, అర్థవంతమైన పాత్రల కోసమే తాను వేచి చూస్తున్నానని తెలిపింది. 'ఈశ్వరన్', 'భూమి', 'కళగ తలైవన్' చిత్రాల తర్వాత తమిళంలో మళ్లీ నటించకపోవడానికి సరైన ప్రాజెక్ట్ రాకపోవడమే కారణమని చెప్పింది. నటనకు ప్రాధాన్యం ఉండే పాత్రలు చేయడానికి తమిళ చిత్రసీమ సరైన వేదిక అని వ్యాఖ్యానించింది. పవన్ కల్యాణ్‌తో 'హరి హర వీరమల్లు', ప్రభాస్‌తో 'ది రాజా సాబ్' వంటి భారీ చిత్రాల్లో నటించడాన్ని గొప్ప అదృష్టంగా భావిస్తున్నట్లు నిధి తెలిపింది. ప్రస్తుతం తెలుగు, హిందీ ప్రాజెక్టులతో బిజీగా ఉండటం వల్లే తమిళ సినిమాలకు కాస్త దూరమయ్యానని పేర్కొంది. వృత్తిపరంగా తాను ఎంతో కష్టపడతానని, అయితే మిగతా విషయాల్లో చాలా సోమరినని సరదాగా వ్యాఖ్యానించింది. అలాగే తనది చాలా సున్నితమైన మనస్తత్వమని, అందుకే భావోద్వేగాలను బయటకు చూపించనని తెలిపింది. ప్రస్తుతం మరో రెండు కొత్త ప్రాజెక్టులకు సంబంధించిన చర్చలు జరుగుతున్నాయని, త్వరలోనే వాటి వివరాలు వెల్లడిస్తానని నిధి చెప్పింది. ఇకపోతే ఆమె త్వరలోనే 'మిరాయ్' పార్ట్-2 తో పాటు హిందీ సైకలాజికల్ థ్రిల్లర్ 'ది ఇన్‌ఫ్లుయెన్సర్' చిత్రాల ద్వారా ప్రేక్షకుల ముందుకు రానుంది.

# నార్త్, సౌత్ పరిశ్రమల తేడాలపై తమన్నా ఆసక్తికర వ్యాఖ్యలు!

సినీ ఇండస్ట్రీలో రెండు దశాబ్దాల సుదీర్ఘ ప్రయాణాన్ని పూర్తి చేసుకున్న మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా... ఇటీవల 'ఫోర్బ్స్' ఇంటర్వ్యూలో ఉత్తరాది, దక్షిణాది చిత్ర పరిశ్రమల పనితీరుపై పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. హిందీ సినిమాల్లో నటీనటులకు వైవిధ్యమైన పాత్రలను ఎంచుకునే స్వేచ్ఛ ఎక్కువగా ఉంటుందని, కేవలం గ్లామర్‌కే పరిమితం కాకుండా నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రల ద్వారా తమ ప్రతిభను చాటుకునే అవకాశం దక్కుతుందని ఆమె తెలిపారు. అదే సమయంలో దక్షిణాది చిత్రసీమ వాతావరణం భిన్నంగా ఉంటుందని వివరించారు. సౌత్ పరిశ్రమలో వాణిజ్య (కమర్షియల్) అంశాలకు, స్టార్ క్వాలిటీకి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారని, కొందరు దీనిని పురుషాధిక్యతగా భావించినప్పటికీ తన దృష్టిలో అది కేవలం అక్కడి కమర్షియల్ సినిమా వ్యవస్థ అని స్పష్టం చేశారు. వీటిని విమర్శలుగా చూడకూడదని, ఇది తన వ్యక్తిగత అనుభవమని చెబుతూ... ఇండస్ట్రీలో సుదీర్ఘకాలం నిలదొక్కుకోవాలంటే కమర్షియల్, కథా ప్రాధాన్యమున్న పాత్రల మధ్య సమతుల్యత పాటించడం చాలా ముఖ్యమని చెప్పారు. కాగా, ఇటీవల హిందీలో వచ్చిన 'స్త్రీ 2' చిత్రంలోని 'ఆజ్ కీ రాత్' పాట యూట్యూబ్‌లో ఏకంగా 1 బిలియన్‌కు పైగా వ్యూస్ సాధించి రికార్డు సృష్టించడంతో తమన్నా జాతీయ స్థాయిలో మరోసారి విశేష గుర్తింపు సాధించారు. ప్రస్తుతం సౌత్, నార్త్ సినీ పరిశ్రమల పనితీరుపై తమన్నా చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి.

PRINTED, PUBLISHED & OWNED By Rolla Raghunath Reddy, PRINTED at Teja Cards & Stationery (Printing & Stationery Supplyers) #78-1-26, Thunnuguntla Vari Street Lalapeta, Guntur - 522001.
EDITOR : Rolla Raghunath Reddy, #4-6-13, Library Road, Koritipadu 1st Lane, Near RCM School, Chandramoulinagar Guntur - 522007. Andhra Pradesh. E-mail: bharathprathinidhi@gmail.com Phone No: 8121214342